




నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com








visit us @ http://epaper.suryaa.com

శనివారం | 25 నవంబర్ 2023 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 34

| పేజీలు 8+12 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు, కార్తీక మాసం శుక్ల త్రయోదశి సా.4.35, అశ్వని మ.2.58 వర్జ్యం. ఉ.11.08 నుంచి 12.40 వరకు తిరిగి రా.12.15 నుంచి 1.48 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు, దుర్ముహూర్తం ఉ.6.10 నుంచి 7.38 వరకు

# నేడే పోలింగ్

● రాజస్థాన్‌లో పోలింగ్ ఏర్పాట్లు పూర్తి ● 199 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు ● బరిలో 1875 మంది అభ్యర్థులు ● ఓటు హక్కు వినియోగించుకోనున్న 5.25 కోట్ల మంది ● 51756 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు




6 లో

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శనివారం జరగనున్నది. సుమారు నెలన్నర రోజుల నుంచి జరుగుతున్న ఎన్నికల ప్రచారానికి గురువారం సాయంత్రంతో ముగింపు పడింది. రాజస్థాన్‌లో మొత్తం 200 నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సారి 199 నియోజకవర్గ స్థానాలకు గాను ఒకే రోజు పోలింగ్ జరగనుంది. అయితే, రాష్ట్రంలో మొత్తం ఈసారి 5.25 కోట్ల మంది వోటర్లు తమ వోటు హక్కు వినియోగించుకోనున్నాను.

## జగన్, సీబీఐకి
# సుప్రీం నోటీసులు

● సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ ● జగన్ బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంలో రఘురాజు పిటిషన్ ● విచారణను హైదరాబాద్ నుంచి ఢిల్లీకి మార్చాలని విన్నపం ● ఇప్పుడే బెయిల్ రద్దు చేయాలా అని ప్రశ్నించిన ధర్మాసనం ● జనవరి మొదటి వారానికి విచారణ వాయిదా

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలనే అభ్యర్థనతో సుప్రీం కోర్టులో ఎంపీ రఘురామకృష్ణ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. జగన్, సీబీఐ సహా ప్రతివాదులు అందరికీ జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్ నేతృత్వంలోని ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.


2 లో

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు


5 లో

● 47 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ ● 7 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ ● ఒకటిన్నర శాతం నష్టపోయిన హెచ్సీఎల్ టెక్నాలజీస్

## బంగాళాఖాతంలో తుపాను

● ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ● దక్షిణ అండమాన్ సముద్రాన్ని ఆనుకుని అల్పపీడనం ఏర్పడే అవకాశం


6 లో

## గవర్నర్లకు
# అధికారం లేదు

● గవర్నర్ అధికారాలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు ● గవర్నర్ బిల్లులను తొక్కిపెడుతున్నారంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన పలు రాష్ట్రాలు ● 10న పంజాబ్ గవర్నర్ అంశంపై సుప్రీం తీర్పు ● తీర్పు ప్రతిని తాజాగా సుప్రీం కోర్టు వెబ్‌సైట్లో పొందుపరిచిన అధికారులు

అసెంబ్లీ సిఫారసు చేసిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా ఉద్దేశపూర్వకంగా తొక్కిపెడుతున్నారని పంజాబ్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం పంజాబ్ గవర్నర్ అంశంపై ఈ నెల 10న తీర్పు వెలువరించింది. ఆ తీర్పు ప్రతిని తాజాగా సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.


6 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## ప్రభుత్వ పథకాలపై
# అవగాహన

● అందరికీ చేరువయ్యే విధంగా రూపొందించిన కార్యకలాపాల ద్వారా అవగాహన పెంచేందుకు దేశవ్యాప్త ప్రచారం ● వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్


2 లో

## స్వయం ప్రకటిత చక్రవర్తిలా జగన్ రెడ్డి


7 లో

● హైకోర్టు తీర్పుల్ని ధిక్కరిస్తూ ప్రభుత్వ కార్యాలయాల తరలింపు ● రూ.433 కోట్ల ప్రజల డబ్బుతో భారతీ రెడ్డికి పుట్టిన రోజు కానుకా? ● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు

## రింగ్ రోడ్డు, ఇసుక కేసులు విచారణ వాయిదా


2 లో

● రింగ్ రోడ్డు కేసు విచారణ 29కి వాయిదా
● ఇసుక పాలసీ కేసు విచారణ 30కి వాయిదా
● చంద్రబాబుపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు

## అంతా ఇంతే!



ఇది కూడా రికార్డు అని చెప్పుకుంటారేమో

## జగన్ పాలన గడువు
# మూడు నెలలు మాత్రమే

● కోర్టు ఆదేశాలున్నా ప్రభుత్వ కార్యాలయాల్ని విశాఖ తరలిస్తున్నారని నారా లోకేశ్ మండిపాటు ● వేల కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే కంపెనీలను తరిమేస్తున్నారు ● కైలాసగిరిని నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు

కోర్టు ఆదేశాలున్నా ప్రభుత్వ కార్యాలయాల్ని విశాఖ తరలించేందుకు ఏపీ సీఎం జగన్ జీవోలు ఇస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం అమరావతిలో సెక్రటేరియట్ కట్టిందని, అందులో కూర్చుని జగన్ ఇదేం రాజధాని అంటున్నారని విమర్శించారు. ఐటీ అభివృద్ధికి కట్టిన మిలేనియం టవర్స్ను ఖాళీ చేయిస్తున్నారు. వేల కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే కంపెనీలను తరిమేస్తున్నారు. రుషికొండను ధ్వంసం చేశారు. కైలసగిరిని నాశనం చేశారు. జగన్ పాలన ఎక్స్పైరీ డేట్ మూడు నెలలు మాత్రమే. మూడు నెలల ముచ్చట కోసం వేల కోట్లు తగలేస్తున్నారని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.


7 లో

## మత్స్యకారులకు పవన్
# ఆర్థిక సాయం

● ఇటీవల విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం ● పెద్ద సంఖ్యలో బోట్లు దగ్ధం ● రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందించిన పవన్ కల్యాణ్ ● డబ్బులు ఇస్తోంది ఎన్నికల కోసం కాదని స్పష్టీకరణ

ఇటీవల విశాఖ ఫిషింగ్ హార్బర్ లో జరిగిన అగ్నిప్రమాదంలో బోట్లు కాలిపోయి, తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇవాళ ఆర్థిక సాయం అందించారు.


2 లో

సూర్య
విజయవాడ
శనివారం
25 నవంబర్ 2023





## విశాఖ నుంచి పాలనకు కీలక అడుగు : విజయసాయి రెడ్డి

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విశాఖ నుంచి పాలన చేసేందుకు కీలక అడుగు వేసిందని, ఈ మేరకు మిలీనియం టవర్లలో మంత్రులు, అధికారుల క్యాంపు కార్యాలయాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోందని అన్నారు. ఎ, బి టవర్లలో 1.75 లక్షల చదరపు అడుగుల వసతి, 16 శాఖలకు వివిధ ప్రాంతాల్లో భవనాలు కేటాయింపు, సచివాలయం, వివిధ శాఖల కార్యాలయాలకు వీటిలో 2.27 లక్షల చదరపు కేటాయించిందని అన్నారు. సంకల్పంతో ముందుకు అడుగులు : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మంచి సంకల్పంతో అడుగులు వేస్తోందని, బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఉన్నత చదువులకు ఊతం ఇవ్వటానికే వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాకు టెన్త్ ఉత్తీర్ణత, కనీస వయసు నిబంధనలు పెట్టిందని చెప్పారు. అయితే వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాకు టెన్త్ ఉత్తీర్ణత, కనీస వయసు నిబంధనలు ఎందుకని చాలా మంది ప్రశ్నించారని, ఆ షరతులతో బాల్య వివాహాలకు అడ్డుకట్టతోపాటు ఉన్నత చదువులకు ఊతం లభిస్తుందనే పవిత్రమైన ఉద్దేశ్యం దీని వెనుక ఉందని అన్నారు. నాయకులుగా ఉండేటప్పుడు మన సంకల్పం మంచిదై ఉండాలని అన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద సీఎం జగన్ రూ.81.64.55.000 విడుదల చేశారని అన్నారు. డీప్‌ఫేక్ వీడియోలు అరికట్టే కఠిన చట్టాలు అవసరం : డీప్‌ఫేక్ వీడియోలను ఆపడానికి కొత్త చట్టాన్ని రూపొందించే ప్రతిపాదనకు నేను మద్దతు ఇస్తున్నానని, తప్పుడు, అసభ్యకర, అభ్యంతరకర వీడియోలు తీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని విజయసాయిరెడ్డి అన్నారు.

# జగన్, సీబీఐకి సుప్రీం నోటీసులు

**● జగన్ బెయిల్ రద్దు చేయాలని పిటిషన్ ● సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ ● జగన్ బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంలో రఘురాజు పిటిషన్ ● విచారణను హైదరాబాద్ నుంచి ఢిల్లీకి మార్చాలని విన్నపం ● ఇప్పుడే బెయిల్ రద్దు చేయాలా అని ప్రశ్నించిన ధర్మాసనం ● జనవరి మొదటి వారానికి విచారణ వాయిదా**



న్యూఢిల్లీ : ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలనే అభ్యర్థనతో సుప్రీం కోర్టులో ఎంపీ రఘురామకృష్ణ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. జగన్, సీబీఐ సహా ప్రతివాదులు అందరికీ జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్ నేతృత్వంలోని ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. జగన్ బెయిల్‌ను సీబీఐ, ఈడీ కనీసం సవాలు చేయలేదని రఘురామ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. గత పది సంవత్సరాలుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత సాక్ష్యాలు చెరిపేస్తున్నారని, వెంటనే బెయిల్ రద్దు చేయాలని ఎంపీ రఘురామ పిటిషన్ దాఖలు చేశారు. సాక్ష్యాలు చెరిపేస్తున్నారు అనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా అని ధర్మాసనం ప్రశ్నించింది. కేసు పూర్వాపరాలు, జరిగిన ఘటనలపై లిఖితపూర్వకంగా వివరాలను రఘురామ తరపు న్యాయవాది కోర్టుకు అందజేశారు. జగన్‌కు బెయిల్ మంజూరు చేసిన తరువాత దర్యాప్తు సంస్థలు ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేయలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. విచారణ చేపట్టిన ధర్మాసనం ఇప్పుడే బెయిల్ రద్దు చేయాలా అని ప్రశ్నించింది. నోటీసులు ఇచ్చి తదుపరి ప్రక్రియ చేపట్టాలని రఘురామ న్యాయవాది కోర్టును కోరారు. ఇప్పటికే విచారణను హైదరాబాద్ నుంచి ఢిల్లీకి మార్చాలని రఘురామ పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. జగన్ బెయిల్ రద్దు చేయాలంటూ ఎంపీ రఘురామ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కోర్టు కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రఘురామ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. నేర తీవ్రతను గుర్తించి జగన్ బెయిల్ రద్దు చేయాలని సుప్రీం కోర్టును రఘురామ కోరారు. తదుపరి విచారణ జనవరి మొదటి వారానికి సుప్రీం కోర్టు ధర్మాసనం వాయిదా వేసింది. అంతే కాదు. ఎంపీ రఘురామ సుప్రీం కోర్టులో మరొక పిటిషన్ కూడా దాఖలు చేశారు. సీఎం జగన్ ఆస్తుల కేసుల విచారణను మరొక రాష్ట్రానికి మార్చాలని పిటిషన్‌లో కోరారు. జగన్ కేసులపై తెలంగాణ సీబీఐ కోర్టులో ఆలస్యం అవుతోందని, జగన్ కేసును 3071 సార్లు సీబీఐ కోర్టు వాయిదా వేసిందని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ కేసుల విచారణ సందర్భంలో జగన్ ప్రత్యక్షంగా హాజరు కాకుండా సీబీఐ కోర్టు మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. వందల కొద్ది డిశ్చార్జి పిటిషన్లు వేసినట్లు పేర్కొన్నారు. సుప్రీం కోర్టు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ధర్మాసనం ఆ పిటిషన్‌పై విచారణ జరిపింది. సీఎం జగన్ కేసుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించింది. ఆలస్యానికి కారణాలు ఏమిటో చెప్పాలని సీబీఐని ధర్మాసనం ఆదేశించింది. సీబీఐతో పాటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించిన ధర్మాసనం ఆ పిటిషన్‌పై తదుపరి విచారణ జనవరికి వాయిదా పడింది.

## పూనం మాలకొండయ్య కుమారుడి వివాహానికి హాజరైన సీఎం జగన్



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : సీఎం స్పెషల్ సీఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, డాక్టర్ మన్నం మాలకొండయ్య ఐపీఎస్ (రిటైర్డ్)ల కుమారుడి వివాహ వేడుకకు శుక్రవారం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. పోరంకి ఎమ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకలో వరుడు శ్రీధర్, వధువు అహల్యను ముఖ్యమంత్రి ఆశీర్వదించారు.

## ఐఆర్ఆర్ కేసులో చంద్రబాబుపై తొందరపాటు చర్యలొద్దు



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఐఆర్ఆర్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. ఈనెల 29కి విచారణను కోర్టు వాయిదా వేసింది. కేసులో తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు చంద్రబాబుపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇసుక పాలసీ కేసులో చంద్రబాబు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో సైతం హైకోర్టులో విచారణ ఈనెల 30కి వాయిదా పడింది.

***ఎస్ఐ నియామకాలపై విచారణ*** : ఏపీలో ఎస్ఐ నియామకాలపై గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేసింది. ఎస్ఐ అభ్యర్థులకు ఎత్తు అంశంలో అన్యాయం జరగలేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. 45వేల మంది యువత భవిష్యత్తు దృష్ట్యా స్టే ఎత్తివేయాలని కోరారు. ఈ మేరకు ఎత్తు కొలతల ప్రక్రియకు సంబంధించిన వీడియోగ్రఫీని కోర్టుకు అందించారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను తోసిపుచ్చిన ఉన్నత న్యాయస్థానం హైకోర్టు నియమించే బృందం సమక్షంలో అభ్యర్థులకు తిరిగి ఎత్తు కొలుస్తామని న్యాయమూర్తి తెలిపారు. అభ్యర్థులు తప్పుడు ఆరోపణలు చేసినట్టు నిరూపితమైతే ఒక్కో అభ్యర్థికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఈ నెల 29న ఎంతమంది హాజరవుతారో తెలపాలని పిటిషనర్ తరపు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 29కి వాయిదా వేసింది.

# అర్హులందరికీ పథకాలు చేరేలా చొరవ చూపాలి

**● ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి ● అందరికీ చేరువయ్యే విధంగా రూపొందించిన కార్యకలాపాల ద్వారా అవగాహన పెంచేందుకు దేశవ్యాప్త ప్రచారం ● వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్**



గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ చేరేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. గుంటూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల అనుభవాలు తెలుసుకుని పథకాలు మెరుగ్గా ఉండేటట్లు చూడాలన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించాలని గవర్నర్ సూచించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర విజయవంతం కావడానికి అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్దిదారులతో సంభాషించడం ద్వారా సమాచారాన్ని వ్యాప్తి చేయడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, పంచుకున్న అనుభవాల ద్వారా ప్రజల నుండి నేర్చుకోవడం ఈ యాత్ర లక్ష్యం అన్నారు. భారత ప్రభుత్వ పథకాలు సంతృప్తిని సాధించడానికి ఉద్దేశించిన అందరికీ చేరువయ్యేలా రూపొందించిన కార్యకలాపాల ద్వారా అవగాహన పెంచడానికి చేపట్టే దేశవ్యాప్త ప్రచారమే - విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర. గిరిజన, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలను కవర్ చేస్తూ పాన్ ఇండియా స్థాయిలో జరిగే ఈ ప్రచారం వివిధ పథకాల కింద అర్హులైన సమాజంలోని బలహీన వర్గాలను చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకుందని, అయితే ఇప్పటివరకు ఈ ప్రయోజనాలు కొందరు ఇంకా పొందలేదని ఆయన అన్నారు. గుంటూరు జిల్లా లాల్‌పురంలో శుక్రవారం నిర్వహించిన 'విక్షిత్ భారత్ సంకల్పం' కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగిస్తూ సమాచారాన్ని ప్రచారం చేయడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులతో సంభాషించడం ద్వారా పంచుకున్న అనుభవాల నుంచి ప్రజల నుంచి నేర్చుకోవడమే విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని పేర్కొన్నారు. 'విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర' అనేది భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు మరియు విభాగాలు, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల క్రియాశీల ప్రమేయంతో సంపూర్ణ ప్రభుత్వ విధానంగా అవలంబించబడిందని ఆయన గమనించారు. దేశ ప్రజలు మరియు విక్షిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకోవడానికి ఈ ప్రచారం మరింత ఉపయోగపడుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు 'విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర' ప్రచారంలో చురుగ్గా పాల్గొని అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని, అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలను పొందేలా వారిని చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. అంతకుముందు, గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర మొబైల్ ఐఇసి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌ల లబ్ధిదారులను వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర అనే అంశంపై రూపొందించిన బుక్‌లెట్లు, క్యాలెండర్‌లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ క్రిస్టినా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కె. మనోహర్ నాయుడు , పార్లమెంటు సభ్యుడు ఎ. అయోధ్యరామి రెడ్డి, ఎం. సుచరిత, ఎం. గిరిధరరావు, హౌసింగ్ జిఎస్‌డబ్ల్యుఎస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, పీయూష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం. వేణు గోపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు.

## మత్స్యకారులకు పవన్ ఆర్థిక సాయం



ఇటీవల విశాఖ ఫిషింగ్ హార్బర్ లో జరిగిన అగ్నిప్రమాదంలో బోట్లు కాలిపోయి, తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇవాళ ఆర్థిక సాయం అందించారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పవన్ కల్యాణ్ బాధిత మత్స్యకారులకు రూ.50 వేలు చొప్పున చెక్కులు అందించారు. అనంతరం పవన్ ప్రసంగించారు. ఇవాళ చాలా ప్రత్యేక పరిస్థితుల్లో విశాఖ వచ్చానని వెల్లడించారు. ఈ నెల 19న జరిగిన అగ్నిప్రమాదంలో బోట్లు దగ్ధం కావడం బాధాకరమని పేర్కొన్నారు. నేనిచ్చే సొమ్ముతో బాధితుల కష్టాలు తీరిపోతాయని నేను నమ్మను. కానీ, మీకు కష్టం వస్తే పవన్ కల్యాణ్ ఉన్నాడు, జనసేన పార్టీ ఉంది, మా నేతలు ఉన్నారు, మా వీర మహిళలు ఉన్నారు, మా జన సైనికులు ఉన్నారు... సాటి మనిషిని ఆదుకునేవారు ఉన్నారనే భరోసా కల్పించడమే మా ఉద్దేశం. గతంలో కౌలు రైతులకు కూడా ఇలాగే సాయం చేశాం. ఇవాళ దాదాపు రూ.30 లక్షలు మత్స్యకార సోదరులకు అందించాం. ఇంతటితో మీ కష్టాలు తీర్చేశాను అని చెప్పను... కానీ మీ కష్టాల్లో, మీ కన్నీళ్లలో నేను కూడా భాగం పంచుకుంటాను అని మాత్రం చెప్పగలను. అందులో భాగంగానే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. ఇక్కడి హార్బర్ 1976లో ప్రారంభమైంది. 700 మరబోట్ల కార్యకలాపాలకు వేదికగా, రోజుకు ఐదు నుంచి పది వేల మంది వచ్చి బేరసారాలు జరిపే కేంద్రంగా ఉన్న హార్బర్ ఇది. వైసీపీ లాగా నేను మత్స్యకారులను ఎప్పుడూ ఓటు బ్యాంకుగా చూడలేదు. మత్స్యకారులు అంటే నా సోదరులుగానే భావిస్తాను. మీరు కష్టాల్లో ఉంటే నేను ఏం చేయగలనన్నది ఆలోచిస్తాను. ఇవాళ నేను... వచ్చే ఎన్నికల్లో ఓట్లు పడతాయన్న ఉద్దేశంతో రాలేదు. నిజంగా నేను అలాంటి వ్యక్తిని కాదు. మీరు కష్టంలో ఉన్నప్పుడు నేను అండగా ఉంటాను. ఓవైపు తెలంగాణలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా జరుగుతోంది. తెలంగాణలో జనసేన పార్టీ బీజేపీతో కలిసి పోటీ చేస్తోంది. ఆ కార్యక్రమాలు కూడా ఆపుకుని ఇక్కడికి ఎందుకు వచ్చానంటే... మీ కష్టాన్ని నా కష్టంగా భావించబట్టే! ఆ బోట్లలో పనిచేసే ప్రతి ఒక్క మత్స్యకారుడికి కూడా సాయం అందించాలని నాకు మనసులో ఉంది. భవిష్యత్తులో ఏమాత్రం అవకాశం వచ్చినా అందరికీ సాయం చేస్తాను. ఇంకొక్క నాలుగు నెలలు ఆగండి... ఇక్కడ భద్రతతో కూడిన హార్బర్ ను తీసుకువచ్చే బాధ్యత జనసేన తీసుకుంటుంది.

# టార్గెట్ చంద్రబాబు అనే లక్ష్యంతో జగన్ రెడ్డి పనిచేస్తున్నాడు

**● చంద్రబాబును జైల్లో పెట్టడమే జగన్ లక్ష్యమన్న వర్ల రామయ్య ● సహకరించే అధికారులకు రివార్డులు ఇస్తున్నారని వెల్లడి ● లేకపోతే బెదిరిస్తున్నారని ఆరోపణ ● చట్టవ్యతిరేకంగా పనిచేసే అధికారులు మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరిక**



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 'టార్గెట్ చంద్రబాబు' అనే లక్ష్యంతో పనిచేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో వర్ల రామయ్య పత్రికా సమావేశం నిర్వహించారు. చంద్రబాబు నాయుడిపై తప్పుడు కేసులు నమోదు చేసి జైల్లో పెట్టాలనే టార్గెట్‌తో జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారని, జగన్ మోహన్ రెడ్డిలా ఫ్యాక్షనిస్టు మనస్తత్వంతో దేశంలో ఏ ముఖ్యమంత్రి పనిచేయడం లేదని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు నాయుడిపై జగన్ మోహన్ రెడ్డి పెడుతున్న కేసుల్లో ఒక్క ఆధారం కూడా చూపలేకపోయారని వెల్లడించారు. టార్గెట్ చంద్రబాబు అనే నినాదంతో పనిచేసే అధికారులకు ప్రమోషన్లు ఇస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు తప్పు చేసే వ్యక్తి కాదు. అలాంటప్పుడు ఆయనను జైల్లో ఎలా పెడతారు? చంద్రబాబు నాయుడు జైల్లో నుంచి బయటకు వస్తే వైసీపీ వారు ఒంటిమీద చలిచీమలు పాకినట్లు ఫీల్ అవుతున్నారు. జగన్ మోహన్ రెడ్డికి చెంచాగిరి చేసే అధికారులు ఉండొచ్చు... కానీ, న్యాయస్థానాలను మాత్రం జగన్ రెడ్డి మభ్యపెట్టలేరు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మొదట మూడు వేల కోట్ల అవినీతి అన్నారు... తర్వాత 3 వందల కోట్లు అన్నారు. చివరికి రూ.27 కోట్లు అని అభాసుపాలయ్యారు. ఒక్క రూపాయి ఖర్చు పెట్టని ఇన్నర్ రింగు రోడ్డు కేసులో అవినీతి అంటూ ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు. చంద్రబాబు నాయుడిపై జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పెడుతున్న తప్పుడు కేసులను అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ సమర్థించడం లేదు కాబట్టే ఆయనను పక్కన పెట్టారు. అందుకే అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి కేసులు వాదిస్తున్నారు. పొన్నవోలు న్యాయపరంగా పవిత్రత లేని వ్యక్తి. 'టార్గెట్ చంద్రబాబు' అన్న జగన్ రెడ్డి విధానానికి పొన్నవోలు సుధాకర్ రెడ్డి తాబేదారులా పనిచేస్తున్నాడు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిజాయతీపరులైన అధికారులను భయపెడుతూ... తప్పుడు కేసులను సమర్థిస్తున్న అధికారులకు అవార్డులు, రివార్డులు ఇస్తోంది. సాధారణంగా ఆధారాలు లేకుండా పోలీసులు కేసులు పెట్టరు. జగన్ మోహన్ రెడ్డి బెదిరింపులకు భయపడే అధికారులు, ఆయన ఇస్తున్న తాయిలాలకు ఆశపడే అధికారులు చంద్రబాబు నాయుడిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. చంద్రబాబునాయుడిపై జగన్ మోహన్ రెడ్డికి ఎందుకంత ద్వేషం? చంద్రబాబునాయుడిపై కక్ష సాధించడం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తూ న్యాయవ్యవస్థను జగన్ మోహన్ రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారు. దీనికి జగన్ మోహన్ రెడ్డి కూడా శిక్షార్హుడే. తప్పుడు కేసులు పెట్టి, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి జగన్ మోహన్ రెడ్డి విధానమైన టార్గెట్ చంద్రబాబుకు వత్తాసు పలకొద్దని అధికారులను హెచ్చరిస్తున్నాం.

# డిసెంబర్ 9న కులగణన ప్రక్రియ ప్రారంభం

**● సమగ్ర కులగణన సామాజిక కోణంలో జరుగుతుంది ● జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న కులగణన నిర్ణయంతో ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుడుతోంది ● మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ**



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : కులగణన ప్రక్రియ డిసెంబర్ తొమ్మిదో తేదీన ప్రారంభమవుతుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖమంత్రి శ్రీ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వెల్లడించారు. తాడేపల్లిలోని వైయస్సార్ సిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన చేయడమే వైయస్సార్ సిపి ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు. సమగ్ర కులగణన పేదవాడి జీవితానికి భద్రత కల్పిస్తుందని తెలిపారు. ప్రజల జీవన స్థితి మారడానికి కులగణన అవసరం అంటూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనగణన తప్ప కులగణన జరగలేదని వివరించారు. ముఖ్యంగా చెప్పాలంటే సామాజిక సాధికారితకు చిరునామా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. కులగణన కోసం రాష్ట్రంలోని కుల సంఘాల నాయకుల అభిప్రాయాలు సేకరిస్తున్నామని ఇందుకోసం ప్రాంతీయ సమావేశాలు నిర్వహించి ఆయా వర్గాల అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలియచేశారు. మన రాష్ట్రంలో జరిగే కులగణన దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందన్నారు. సమగ్ర కులగణన సామాజిక కోణంలోనే జరుగుతుందని అన్నారు. ప్రతిపక్షాలకు కులగణన అంటే వెన్నులో వణుకు పుడుతోందని తెలిపారు. కులగణనతో చంద్రబాబులాంటి ప్రతిపక్షనేతలకు కుబుసాలు కదిలాయన్నారు. చంద్రబాబు హయాంలో బిసిలను కేవలం ఓట్లకు పనికివచ్చే యంత్రాలుగా చూశారన్నారు. చంద్రబాబు ఏ వర్గాలనైతే వివక్షతో చూశారో, న్యూనతతో చూశారో ఆ వర్గాల విద్యాహీనతో, ఆర్థికమైన బలహీనత కారణంగా ప్రత్యేకించి బిసిలను అణగదొక్కేవిధంగా చంద్రబాబు అప్పట్లో సిఎం స్థానంలో ఉండి అవమానించారన్నారు. మత్స్యకారులను తోలుతీస్తానని, నాయీబ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తాననే మాటలు విన్నతర్వాత చాలా బాధ కలిగిందన్నారు. చంద్రబాబు వివక్షతో చూసిన కులాలు, వర్గాలను వైయస్ జగన్ అక్కున చేర్చుకున్నారన్నారు. వారిలో న్యూనతా భావాన్ని తొలగించారన్నారు. వారిదే వైయస్సార్ సిపి ప్రభుత్వం అనే విధంగా సగర్వంగా తలెత్తుకుని చెప్పుకునే విధంగా జగన్ మోహన్ రెడ్డి అండగా నిలిచారన్నారు. తెలుగుదేశం నేతలు విమర్శలు చేస్తున్నారు వాలంటీర్ల వ్యవస్థ ఇది నిర్వహిస్తే సొంటిటి ఉండదని అంటున్నారు. కాని కులగణన గురించి మాట్లాడే నైతిక అర్హత వారికి ఎక్కడిది అని ప్రశ్నిస్తున్నాను. బిసి కులాలను వివక్షతో అవమానిస్తుంటే ఆ పార్టీలో ఉన్న బిసి నేతలు చంద్రబాబును కనీసం ప్రశ్నించలేకపోయారన్నారు. తోలుతీస్తానని, తోకలు కత్తిరిస్తానని అంటే మీకు సరదాగా అనిపించిందా అప్పట్లో ఎందుకు చంద్రబాబుకు బుద్ధి చెప్పలేకపోయారు అని అన్నారు. కులగణన ప్రక్రియలో కులసంఘాల నేతలు, మేధావులు అందరూ జగన్ గారు తీసుకున్న కులగణన నిర్ణయాన్ని స్వాగతించాలన్నారు. తెలుగుదేశం పార్టీ, ప్రభుత్వం ఎవరి సలహాలు తీసుకోలేదని విమర్శిస్తోందని అది పూర్తిగా అవాస్తవం ఐదు రీజనల్ సమావేశాలు నిర్వహించామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో సమావేశాలు పెట్టి కులసంఘాల నేతల సమావేశాలు పెట్టి వారి సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు. వారి అభిప్రాయాలను క్రోడీకరించాం. ఇంకా వాటిలో రెక్టిఫై చేయాలంటే ఆలోచన చేశాం. వీటిని టిడిపి నేతలు గమనించడం లేదు. అవసరమైతే మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆలోచన చేస్తున్నామని వివరించారు. ప్రతిపక్షాలు క్రిటిసిజం కోసం మాట్లాడుతున్నారు. ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకుంటే స్వాగతించాల్సింది పోయి విమర్శించడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ లు పచ్చమీడియా ఈనాడు, ఏబిఎన్, టివి-5తో కలసి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల అకాంక్షలను అధ్యయనం చేసి అర్థం చేసుకున్న ప్రభుత్వం అని కులగణన చేయాలని జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రజారంజకమైందని అన్నారు.

## జనసేన నుంచి వైసీపీలోకి కీలక నేతలు



గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో జనసేన పార్టీకి మరో షాక్ తగిలింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో జనసేన మాజీ ఇన్‌ఛార్జ్ మేడా గురుదత్త ప్రసాద్ వైఎస్సార్‌సీపీలో చేరారు. గురుదత్తతో పాటు మరికొందరు జనసేన నేతలు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం జనసేన మాజీ ఇన్‌ఛార్జ్ మేడా గురుదత్త ప్రసాద్ వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమక్షంలో గురుదత్త ప్రసాద్‌తో పాటు జనసేన నాయకులు మండపాక శ్రీను, అడబాల సత్యనారాయణ, వడ్డి చిన్నా, నాగవరపు భానుశంకర్, వల్లేపల్లి రాజేష్, చొంగా మణికంఠ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీలోకి సందీప్, పద్మావతి : ఇదిలా ఉండగా ఇటీవలే జనసేన కేంద్ర కార్యాలయ ఇంఛార్జి సందీప్‌తో పాటు రాయలసీమ రీజియన్ ఇంఛార్జి పద్మావతిలు పార్టీకి గుడ్‌బై చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సమక్షంలో వీరు వైఎస్సార్‌సీపీ కండువా కప్పేసుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌పై సంచలన ఆరోపణలు, తీవ్ర విమర్శలే చేశారు. పవన్ కల్యాణ్‌కు ఆ పార్టీలో ఉండే రుక్మిణి అంటే భయం. ఆమె మాట విని చాలామందిని రోడ్డు మీదకు నెట్టారు. ఆయనో అహంకారి. తన స్వార్థం కోసం ఎంతో మందిని బలి చేశారు. యువతను దారుణంగా మభ్య పెడుతున్నారు.

సూర్య
విజయవాడ
శనివారం
25 నవంబర్ 2023

4

సంపాదకీయం
editpage@suryaa.com

ఆకాశంలో సగం అతివ అంటూ ఒకవైపు పొగడ్తలతో స్త్రీలను ముంచెత్తడం, మరోవైపు స్త్రీలపై అణచివేత కొనసాగించడం ద్వంద్వ నాలుకల ధోరణికి అద్దం పడుతున్నది.స్త్రీలను శారీరకంగా,మానసికంగా హింసించి ఆనందించడం మానవ లక్షణాలు కోల్పోయిన దుర్మదాంధులు చేసే వికృత క్రీడలో ఒక భాగం. ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలపై ఇంకా అనేక అరాచకాలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయి. పశువాంఛతో స్త్రీలను హింసించి,హతమార్చే నీచ సంస్కృతి మారాలి.పాఠశాలలకు పంపించాలంటే భయం.పై చదువులు చదవించాలంటే భయం. ఉద్యోగాలు చేయాలంటే భయం...అంతెందుకు మాతృావి గర్భం నుండి జన్మించిన మరుక్షణం నుండే ఆడజన్మకు అగచాట్లు ఎదురౌతున్నాయి. భ్రూణ హత్యల నుండి, లైంగిక అత్యాచారాల వరకు, వరకట్న వేధింపుల నుండి, హత్యల

## విద్యా హక్కు పరి రక్షణ అందరి బాధ్యత

వరకు అనాదిగా స్త్రీ జాతి ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణనాతీతం. స్త్రీ ని అగౌరవంగా చూస్తూ, శీల హననానికి గురిచేసే ఆటవిక ప్రవృత్తి మారాలి.ఇదో రంగుల ప్రపంచం. అనునిత్యం వినూత్నమైన సంఘటనలతో నిత్య నూతనంగా కనిపించే కృత్రిమ ప్రపంచంలో జీవించడమే ఆధునిక నాగరికత నేర్పిన అరుదైన విద్య. మానవత్వం స్థానంలో 'పశుత్వం' ప్రబలినా అలాంటి అమానుషత్వాన్నే కనులారా వీక్షించి,మనసారా ఆస్వాదించి, ఆరాధించే మనస్తత్వాలతో ఆటవిక నాగరికత పునరారంభం కాబోతున్నది. దానవత్వాన్ని పునరావృతం చేసి,సర్వత్రా వ్యాపింపచేసి, ఆనందించడమే ఒక కళగా మారిన నేపథ్యంలో మానవత్వమనే మాట చమురులేని దీపంలా ఆరిపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించాలనే మేధావుల మాటలు, ప్రవచనకర్తల ఉపదేశాలు కేవలం వినడానికే తప్ప ఆచరించడానికి అవకాశం లేని పరిస్థితులు దాపురించాయి. భారతదేశం అనాదిగా విలువలకు ప్రతి రూపం. కొందరి ప్రబుద్ధుల వక్రబుద్ధుల వలన మానవసమాజం అపఖ్యాతి పాలవుతున్న నేపథ్యంలో ఆవేదనతో,ఆక్రందనతో ప్రశ్నించాలని ప్రయత్నించడం నిజంగా ఒక అభ్యుదయ భావమే. ఒక చైతన్య వికాసమే. అయితే ప్రశ్నించే గళాలు మూగబోతున్నాయి. నిరాశతో నిశ్శబ్దం ఆవహిస్తున్నది.ఆక్రోశంతో, ఆవేశంతో, తమ ఆవేదనను వెళ్లగ్రక్కే కలాలు నిశ్శబ్దంతో చెలిమి చేస్తున్నాయి. ఇది ఈనాటి సమస్య కాదు. ఇది అనాదిగా సాగుతున్న తంతు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ పైశాచిక క్రీడా విన్యాసం పరాకాష్ఠకు చేరింది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, రాజ్యాంగంలో ఎన్ని సవరణలొచ్చినా, ప్రజల్లో ఐక్యత కొరవడిన కారణంగా చట్టాలను సైతం నిర్వీర్యం చేసే చీకటి వ్యవస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి స్త్రీల పట్ల చులకన భావనతో వారిని ఆర్థికంగా ఎదగనీయకుండా అన్ని రంగాల్లో అణగద్రొక్కే పురుషాధిక్య ప్రపంచాన్ని ధిక్కరిస్తూ ఎంతో మంది మహిళామణులు సామాజిక ,సాంస్కృతిక,ఆర్థిక,రాజకీయ, విద్య, వ్యాపార,విజ్ఞాన సాంకేతిక రంగాల్లో ప్రవేశించి తమ నైపుణ్యంతో ప్రపంచాన్నే శాసిస్తూ స్వావలంభన,సాధికారత దిశగా పయనించడం నడుస్తున్న చరిత్రలో చోటు చేసుకుంటున్న మహిళల ప్రతిభా పాటవాల ప్రగతి కి సంబంధించిన పరివర్తనా క్రమం. అయితే మహిళలను చులకనగా చూడడం, వారిని ఆర్థికంగా ఎదగనీయకపోవడం, మహిళల పట్ల హింసాత్మక ధోరణి పెంపొందించుకోవడం ఆధునిక యుగంలో కొనసాగుతున్న అజ్ఞానానికి పరాకాష్ఠ. మహిళలను హింసించే వైఖరి నశించాలి. ప్రపంచవ్యాప్తం గా మహిళలపై కొనసాగుతున్న హింస జుగుప్సాకరం. అంతర్జాతీయ సమాజం ఇకనైనా మేల్కొనకపోతే భవిష్యత్తులో స్త్రీ జాతి అంతరించి పోయి, మగువ లేని ప్రపంచం ఆవిర్భవించే విపరీత పరిణామాలు సంభవించే అవకాశాలున్నాయి. ఇటీవలి కాలంలో టెక్నాలజీ ఆధారిత డీప్ ఫేక్ వీడియోలు మహిళా ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న విషయం విదితమే. మహిళల గౌరవాన్ని మంటగలుతున్న సాంకేతిక మాధ్యమాల పట్ల జాగరూకత వహించాలి. మహిళల పట్ల కొనసాగుతున్న హింసకు స్వస్తి పలకాలి.నవంబర్ 25 వ తేదీన జరిగే అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవం సమాజంలో పరివర్తన తీసుకురావడానికి దోహదం చేయాలని ఆశిద్దాం.

**పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :**
**suryaeditpage@gmail.com**

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# స్థానిక యాస- తెలంగాణ శ్వాస మనదే కావాలా?

**● అదే తెగువ- అదే తపన. అదే దూకుడు ● రాష్ట్ర సాధన తరహాలో కెసిఆర్ వీరోచిత ప్రచారం ● కష్టించి సాధించుకున్న తెలంగాణను వేరే వాళ్ళ చేతుల్లో పెట్టొద్దని తపన ● ఆశీర్వాద సభల పేరిట ముఖ్యమంత్రి దూకుడు మున్నెన్నడూ లేని విధంగా ఒత్తిడికి లోనవుతున్న కేసీఆర్**



వి. వీరాంజనేయులు,
సూర్య బ్యూరో, 9392234163

బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మున్నెన్నడూ లేని విధంగా ఒత్తిడికి లోనవుతున్నారు.ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు వీరోచితంగా ముందుకు సాగుతున్నారు. తనదైన శైలిలో పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కెసిఆర్ ప్రదర్శించిన తెగువ అపూర్వం, అనితర సాధ్యం. అయితే ప్రాణాలకు తెగించి సాధించిన తెలంగాణ లక్ష్యాలు ఇంకా నెరవేరలేదనే ఆలోచనలో కేసీఆర్ ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పది సంవత్సరాలు కావస్తున్నప్పటికీ , నీళ్ళు ,నిధులు నియామకాల వంటి కీలకమైన ప్రక్రియ ఇంకా కొనసాగాల్సిందే అనే నిశ్చితమైన అభిప్రాయం బి .ఆర్. ఎస్. అధినేతలో ఉంది. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా అణచివేత ధోరణితో చిట్టచివరి దాకా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీ చేతుల్లోకి అధికారం వెళ్ళకూడదనే దృఢమైన చిత్తంతో కేసీఆర్ ఉన్నారు. ఆ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం, ఎన్నికలు హోరాహోరీగా జరుగుతూ ఉండటం పరిస్థితులన్నీ అనిశ్చితంగా మారాయి. హ్యాట్రిక్ ను సాధించాలనే సంకల్పంపై నీలి నీడలు కమ్ముకున్నాయనే ప్రచారం నెలకొంది.ఫలితంగా మళ్లీ బి.ఆర్. ఎస్ అధికారంను నిలబెట్టుకోవడం మరియు కాంగ్రెస్ చేతుల్లోకి తెలంగాణ వెళ్లకుండా ఉండేందుకు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరిస్తున్నారు. ఆలోచించి ఓటు వేయాలని పేర్కొంటూ రాష్ట్రాన్ని సాధించినంత స్థాయిలో కేసీఆర్ అలుపెరుగని పోరాటం సాక్షాత్కరిస్తుండడం విశేషం.

కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజాఆశీర్వాద సభల్లో సానుకూలమైన ప్రజాస్పందన వ్యక్తమవుతున్నది. ఇప్పటికే గురువారం నాటికి 37 రోజులు 76 సభలు పూర్తయ్యాయి. ప్రధానంగా ప్రజాస్వామిక తాత్వికతను విశ్లేషిస్తూ పార్లమెంటరీ పంథా ను ప్రజలకు అర్థం చేయిస్తున్నారు. తమ ఆకాంక్షల సాధనకోసం రాజ్యాంగం అందించిన ఓటునే వజ్రాయుధంగా ఎట్లా వినియోగించుకోవచ్చునో ప్రజలకు వివరిస్తున్నారు. అదే సమయంలో అప్రజాస్వామికంగా, అసంబద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల్లో విద్వేషాలు నింపుతున్న ప్రతిపక్షాలపై ఈ సభల్లో రోజురోజుకూ వాడీవేడీ పెంచుతున్నారు సీఎం కేసిఆర్. బీఆర్ఎస్ అంటే భరోసా అని, కాంగ్రెస్ అంటే తెలంగాణ కు శాపమని వివరిస్తున్నారు. తాను చెప్పిన అంశాలన్నీ ఇంటికి వెళ్లి ఆలోచించుకుని చర్చలు పెట్టమనడం ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. సభలకు వచ్చిన ప్రజలు కేరింతలు కొడుతూ బీఆర్ఎస్ పట్ల ఉన్న తమ అభిమానాన్ని చాటుతున్నారు.

కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని నమ్మవద్దని ప్రజలకు ప్రజా ఆశీర్వాద సభలో కెసిఆర్ సూచించారు. ఆనాడు సమైక్య వాదుల తొత్తుగా వ్యవహరించి తెలంగాణను కూల్చేయడానికి ప్రయత్నించి, ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్న దొంగ పీసీసీ అధ్యక్షునిగా కొనసాగుతున్న రేటెంత రెడ్డి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రజలను సీఎం కేసీఆర్ హెచ్చరించారు. 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా కొనసాగుతాయని తెలిపారు. భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగాయన్నారు.కాంగ్రెస్ హయాంలో కరువు కోరల్లో ఉన్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రేవంత్ రెడ్డి రాజకీయాల్లో ఉండదగిన మనిషి కాదని తెలిపారు. రేవంత్ రెడ్డి గుణం ఏంటి? టిక్కెట్లు అమ్ముకున్నడని కాంగ్రెస్ నేతలే అంటున్నరని విమర్శించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమం నాడు ఆంధ్రోళ్ల సంకల ఉండే. తెలంగాణ ఉద్యమకారుల మీదికి తుపాకీ పట్టుకుని బయలుదేరిండు. ఎవరైనా అడ్డమస్తే కాల్చేస్తా అని బెదిరించారని సీఎం మండిపడ్డారు.

తెలంగాణ వచ్చింది,మంచిగ నడువుకుంటున్నం. ఏం జేసిందు రేవంత్ రెడ్డి,.. రాష్ట్రాన్ని అస్థిరపరచడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనడానికి నగదు రూ. 50 లక్షలు ఇచ్చుకుంటూ దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితడని మీరు ఓట్లేస్తే మోసపోతరని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను 58 ఏండ్లు ఏడిపించిందన్నారు. అనేక కరువులకు గురి చేసిందని తెలిపారు. పాలమూరు జిల్లాను బొంబాయి బస్సులకు ఆలవాలం చేసింద్రు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కనీసం మంచినీళ్లు, సాగునీళ్లు, కరెంటు ఇవ్వలేదు. పైగా చేనేత కార్మికుల ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు జరిగేలా దుర్మార్గంగా పాలించిందని మండిపడ్డారు. ఆ తరువాత సొంత రాష్ట్రం ఏర్పాటయ్యాక బీఆర్ఎస్ పాలనలో ఎంతగానో అభివృద్ధి చేయడం జరిగిందని, ప్రజలంతా తమ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.మిషన్ మోడ్లో పేదలకు ఇండ్లు కట్టిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. సౌభాగ్యలక్ష్మి, గృహలక్ష్మి పథకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంకా రాష్ట్రం ముందుకుపోవాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మల్ల రావాలి. తెలంగాణ ఇంకా చిక్కపడాలంటే తప్పకుండా మీ ఆశీస్సులు అవసరమవుతాయి. అందుకే ఓటు అంటే ఆషామాషీగా వేయొద్దు. చాలా ప్రోగ్రాములు ప్రకటించాం. ఆడబిడ్డల కోసం సౌభాగ్యలక్ష్మి పథకం తీసుకువచ్చా. వారికి ఆర్థిక సాయం అందిస్తాం. ఇలా ఎన్నో కార్యక్రమాలు ప్రకటించాం. వ్యవసాయం, కరెంటు, మంచినీళ్లు, రోడ్లు బాగు చేసుకుంటూ వచ్చాం. పేదలకు ఇండ్లు కట్టాలి పేదలకు నాకు తెలుసు. తప్పకుండా వచ్చే సంవత్సరంలో మిషన్ మోడ్ తీసుకొని ముమ్మరంగా ఇండ్లు కూడా కట్టిస్తాం. జాగలు లేని వారికి జాగలు ఇస్తాం. జాగలు ఉన్న వారికి గృహలక్ష్మి కింద మంజూరు చేస్తాం. గృహాలు నిర్మించుకుందాం. ఒకటేరోజు అన్నీ కావు కదా? ఒకటి తర్వాత ఒకటి చేసుకుంటూ పోతున్నాం. కనీస అవసరం కొన్ని ఇప్పుడు తీరినయ్. రేపు ఇండ్ల నిర్మాణం కూడా బ్రహ్మాండంగా చేసుకుందాం అని సీఎం అన్నారు. ఇతర పార్టీల నాయకుల కన్నా అత్యంత భిన్నంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అచ్చమైన తెలంగాణ యాసలో మాట్లాడుతూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. తనదైన శైలిని కొనసాగిస్తున్నారు .ఏ ప్రాంతానికి వెళితే అక్కడే స్థానిక సమస్యలను ప్రస్తావిస్తున్నారు. ప్రజలు పాజిటివ్ గా స్పందించే విధంగా మసలుకుంటున్నారు. ఉద్యమాన్ని నిర్వహించిన సమయంలో కూడా కేసీఆర్ ఇదే పంథా లో కొనసాగారు. సొంత రాష్ట్రం తెలంగాణ వాదుల పరిపాలనలో కొనసాగాలనేది కేసీఆర్ అభిమతంగా కనిపిస్తోంది. అందుకోసం హ్యాట్రిక్ విజయం కోసం అధికార సాధన కోసం కేసీఆర్ భగీరథ యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. ఇలా ఉండగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకునే క్రమంలో కేసీఆర్ చేస్తున్న పోరాటానికి రాష్ట్ర ఆర్థిక,వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, మరో మంత్రి కల్వకుంట్ల తారక రామారావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు బాసటగా నిలుస్తున్నారు. వీరోచితమైన రాజకీయ పోరాటం చేస్తూ అడుగులు వేస్తున్నారు. అప్రతిహతంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

# బీసీ కులాలపై స్పష్టత వస్తుందన్న ప్రభుత్వం

**● కులగణనకు ప్రత్యేక యాప్ రెడీ చేసిన ప్రభుత్వం ● కులగణన వాలంటీర్లతో నిర్వహింప చేయాలని ప్రభుత్వం నిర్ణయం ● ఆడుదాం ఆంధ్రా, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలకు అవాంతరం ● కులగణన కార్యక్రమాన్ని డిసెంబర్ 10వ తేదీ వరకు వాయిదా ● శాంపిల్ పునఃపరిశీలన చేపడతామని ప్రభుత్వం ప్రకటన**




బి. వెంకట రమణ
సీనియర్ జర్నలిస్ట్

ఏపీలో వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కుల గణన ప్రక్రియను తాత్కలికంగా వాయిదా వేశారు. ఈ విషయాన్ని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రకటించారు. వాస్తవానికి రాష్ట్రంలో కులాల వారీగా అధికారిక సర్వే(కుల గణన)కు ప్రభుత్వం నిర్ణయించింది. నవంబర్ 15 తర్వాత రాష్ట్రమంతటా ఈ సర్వే మొదలుపెట్టేందుకు అధికారులు కార్యాచరణను సిద్ధం చేసారు. వలంటీర్లతో సంబంధం లేకుండా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ద్వారా ఈ సర్వే చేపట్టాలని నిర్ణయించారు. సచివాలయాల ఉద్యోగులు ఆయా సచివాలయాల పరిధిలో ఉండే ఇంటింటి వివరాలు సేకరించేందుకు సిద్ధమైపోయారు దీనికి తోడు పారదర్శకత కోసం.. సచివాలయాల వారీగా జరిగిన సర్వేపై మండల స్థాయిలో శాంపిల్గా అక్కడక్కడా పది శాతం ఇళ్లకు సంబంధించి సంబంధిత మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్(ఆర్ఐ)ఆధ్వర్యంలో పునః పరిశీలన జరుపుతారు. మూ డో స్థాయిలోనూ.. కింది స్థాయిలో జరిగిన సర్వేపై రెవెన్యూ డివిజన్ స్థాయిలో అక్కడి స్థానిక ఆర్డీవో ఆధ్వర్యంలోనూ శాంపిల్ పునఃపరిశీలన చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది.

రాష్ట్ర ప్రణాళిక శాఖతో పాటు బీసీ, సాంఘిక సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఈ కుల గణనకు సంబంధించిన పూర్తి స్థాయి విధివిధానాలపై రూపకల్పన జరుగుతోంది. మరో పక్క క్షేత్ర స్థాయిలో సమర్థంగా సర్వే చేపట్టేందుకు వీలుగా గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇందుకోసం మొబైల్ యాప్ను సిద్ధం చేసింది. కులగణన ప్రత్యేక మొబైల్ యాప్ తయారీపై ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల శాఖలో కీలక అధికారుల స్థాయిలో రెండు విడతల సమావేశాలు కూడా ముగిశాయి. జనాభా ప్రాతిపదికన సమాన అవకాశాలు పొందేలా దేశ వ్యాప్తంగా కులగణన జరపాలంటూ బీసీ సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

ఈ ప్రక్రియలో భాగంగా..ఏపీలో ప్రత్యేకంగా కుల గణన చేపట్టేందుకు సీఎం జగన్ గతంలోనే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఇదిలా ఉంటే, నవంబర్ 15కు ముందే రాష్ట్రంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 27వ తేదీ నుండి కుల గణన ప్రక్రియ మొదలుపెట్టాలని నిర్ణయించింది. ఇందు కోసం సన్నాహక శిబిరాలను కూడా పూర్తి చేశారు. పూర్తి స్థాయి కులగణనకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 27 నుంచి వారం రోజుల్లో కులగణన చేయాలనుకున్నారు. కనీ ఇప్పుడు డిసెంబర్ 10వ తేదీ నుండి చేపట్టాలని నిర్ణయించారు.

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం కొనసాగుతోంది. దీంతో పాటుగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో, కులగణన కార్యక్రమాన్ని డిసెంబర్ 10వ తేదీ వరకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నిర్ణయాల్లో సవరణ చేసింది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద వేర్వేరు చోట్ల మూడు గ్రామ సచివాలయాలు, రెండు వార్డు సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహించారు. ఈ నెల 27 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కసరత్తు పూర్తి చేసింది. డిసెంబర్ 3 నాటికి సర్వే పూర్తి చేయాలని భావించింది. కానీ, ఇప్పటికే ప్రారంభమైన కార్యక్రమాల్లో అవాంతరాలు రాకుండా తాజా నిర్ణయం తీసుకుంది.

కులగణన వాలంటీర్లతో నిర్వహింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక యాప్ సిద్ధం చేశారు. కుల గణన సర్వే వివరాల నమోదుకు వాలంటీర్ల సెల్ ఫోన్ లో ప్రత్యేక యాప్ పొందుపరిచారు. సర్వే ప్రారంభం నుంచి ముగింపు వరకు వాలంటీరు ఒకే సెల్ ఫోన్ ను వినియోగించాలి. వివరాలు సేకరించేటప్పుడు గానీ, పూర్తి అయిన తరువాత గానీ, స్క్రీన్ షాట్ లేదా వీడియో రికార్డింగ్ చేసేందుకు వీలు లేకుండా యాప్ ను డిజైన్ చేసారు. సర్వేలో భాగంగా చిరునామా, కుటుంబ సభ్యుల సంఖ్య, వివాహ వివరాలు, కులం, ఉపకులం, మతం, రేషన్ కార్డు నంబర్, విద్యార్హత, ఇంటి వివరాలు, వంట గ్యాస్ తో పాటుగా ఉపాధికి సంబంధించిన వివరాలు సేకరించనున్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు డిసెంబర్ 10వ తేదీ నుంచ కులగణన ప్రారంభం అవుతుంది.

కులగణన ద్వారా బీసీ కులాలకు సంబంధించి ఒక స్పష్టత వస్తుందని ప్రభుత్వం చెబుతోంది. వృత్తులవారీగా సమగ్ర అధ్యయనం చేపట్టనుంది ఏపీ ప్రభుత్వం. దీంతో బీసీ సామాజిక వర్గాల వారీగా ఉన్న జనాభాపై స్పష్టత రానుంది. ఇలా వివరాలు తెలిస్తే.. పథకాలు సక్రమంగా అమలు చేయవచ్చని అంచనా వేస్తోంది.

## గ్యారంటీల తీరు మారాలి, ప్రజల బ్రతుకులు మారాలి.



ఈ సంవత్సరం ఎలక్షన్ల సీజన్లో గ్యారెంటీల సంస్కృతి వరదలా పారి సముద్రంలా ఉవ్వెత్తున ఎగసిపడుతోంది. మామూలు మ్యానిఫెస్టోలను ప్రజలు నమ్మడంలేదని పార్టీలకు అర్థమయిది. ఒక పార్టీకి మించి మరో పార్టీ ష్యూరిటీ, గ్యారంటీ, వారంటీ పత్రాలు ముద్రించి మరీ జనానికి పంచాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. గ్యారంటీలనేవి, కొన్ని వర్గాలకు లేక కొన్ని పార్టీలు అధికారంలోని రావడానికి ఉపయోగవడే విధంగా ఉండకూడదు. కొంతమందికి మాత్రమే ఉపయోగపడే ఈ విధమెన గ్యారంటీలు కాకుండా దేశంలోని, రాష్ట్రంలోని ప్రతివ్యక్తికీ ప్రతి పార్టీ బాధ్యతతో కూడిన ఖచ్చితమెన గ్యారెంటీలు ఇవ్వాల్సినవి ఇంకా చాలావున్నాయి. ముందుగా పార్టీలు మారిన వెంటనే పదవి, సభ్యత్వము కోల్పోయేలా పట్టిష్ట చట్టం తెచ్చేందుకు కేంద్ర జాతీయ పార్టీలు వారంటీ లెటర్ పంచగలవా? ఒక పార్టీలో కొనసాగుతున్న నాయకుడు ఎం.ఎల్.ఎ.గా లేదా ఎం.పిగా గెలిచిన పార్టీలో ఐదు సంవత్సరాలకాలం ఎన్ని కష్టాలెదురైనా అదే పార్టీలో బాధ్యతగా ఉంటామనే గ్యారంటీని కనీసం ఆ నియోజకవర్గ ప్రజలముందు ప్రకటించగలడా? ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, లేదా అన్ని పార్టీల, ప్రతిపక్షాల నాయకులు గెలిచిన తర్వాత ఐదు సంవత్సరాలవరకు సుపరిపాలనే ధ్యేయంగా పనిచేస్తామని, వేదికలపై ఎదుటి పార్టీవారిపై వ్యక్తిగత దూషణలు, మహిళలను కించ పరిచే మాటాలు మాట్లాడబోమని, తమ అనుచరగణాన్ని ఎటువంటి విధ్వంసాలకు పాల్పడనివ్వబోమని పాల్పడితే అలాంటి నష్టాన్ని తమ పార్టీ భరిస్తుందని గ్యారింటీ పత్రాల్లో జతచేయగలరా? ఎన్నికైన ప్రభుత్వాలకు ఐదు సంవత్సరాలపాటు వ్యవస్థల నడ్డుపెట్టుకుని ఎటువంటి పాలనాపరమెన అడ్డంకులు కల్పించబోమని హామీ పత్రం ఎవరిస్తారు? కులమతాలకు అతీతంగాను, కక్షపూరిత రాజకీయాలకు దూరంగానూ ఉంటామని ప్రతి పార్టీ గ్యారెంటీ సర్టిఫికెట్లు ముద్రించి ఇవ్వగలదా? ఓటు కొనబోమని, ప్రజల సొమ్ము తినబోమని, అవినీతికి, ఆశ్రీత పక్షపాతానికి తావివ్వబోమని గ్యారెంటీ ఇవ్వగలరేమో ప్రజలకు చెప్పాలి. పథకాల గ్యారంటీలు, ప్రలోభాల వారంటీలు గెలవడానికి తప్ప ప్రజసేవకు పనికిరావని గమనించాలి. నిరుద్యోగ నిర్మూలన, పేదరికం ప్రక్షాళన, విద్య, వెద్య, వ్యవసాయ రంగాలకు అత్యంత ప్రాధాన్యత, మహిళల విద్యార్థుల అభ్యున్నతికి చక్కటి ప్రణాళితో నిర్వివాదమెన, సహేతుకమెన, చట్టబద్ధమెన హామీలు మ్యానిఫెస్టోలో చేర్చి, గెలిచిన మొదటిరోజునుంటి వాటిని అమలు చేసేందుకు కంకణం కట్టుకుని ప్రజలకు తినడానికి మెతుకు గ్యారంటీనీ, బ్రతుకు గ్యారంటీని ఇవ్వగలరా? గెలిచిన తర్వాత ఏ ఒక్క హామీ నెరవేర్చకపోయినా మరుసటి ఎలక్షన్లలో పోటీ చేయబోమని నిర్వదందమెన హామీ పత్రం పంచగలరా!. చట్టం, న్యాయం, ధర్మం ఈ వ్యవస్థలను చుట్టాలుగా వాడుకోబోమని, చట్ట సభలలో ప్రభుత్వాలకు అడ్డంకులు కల్పించబోమని ప్రజా ప్రయోజనకరమెన బిల్లులన్నింటికీ మద్దతిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో అలుపెరుగని సైనికుడిలా శ్రమిస్తామని, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అంకిత భావంతో పనిచేస్తామనీ గ్యారెంటీలు, వారంటీలు ఇవ్వగలరేమో చెప్పి ఓటర్లకు నమ్మకం కలిగిస్తే మన ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుంది

**– జోస్యుల వేణుగోపాల్,**
**944043606**

# నరమేధంలో నాలుగు రోజుల విరామం

ఇజ్రాయెల్,హమస్ మధ్య జరిగిన ఒప్పందం వల్ల పాలస్తీనా లో నాలుగు రోజుల పాటు యుద్ధం నిలవడం కొంచెం కంటి తుడువు.వేలాది మంది అమాయక పౌరులు రోజూ ప్రాణాలు పోగొట్టుకుంటున్న యుద్ధంలో కొన్ని ఊపిరులు అయినా మిగులుతాయని కొంచెం ఆశ. అక్టోబర్ 7 న హమస్ దాడి చేసి 1200 మంది ఇజ్రాయెల్ పౌరుల ప్రాణాల్ని బలి తీసుకోగా, అక్కడి నుండి ఇజ్రాయెల్ విరుచుకుపడి పాలస్తీనా లో గాజా ప్రాంతంలో 14 వేల మంది ఉసురు తీసింది.అందులో పౌరులు ఎక్కువ.తీవ్రవాదులు తక్కువ. ఇల్లూ,ఆసుపత్రి, పిల్లలూ అని చూడకుండా దొరికిన వాటిని దొరికినట్టే ధ్వంసం చేసింది.ఆ ప్రాంతంలోకి ఆహారం,మందులు,మంచినీళ్ళు తదితర మానవతా సాయం కూడా అందనివ్వలేదు.ప్రస్తుతం హమస్ చేతిలో ఉన్న బందీలు,ఇజ్రాయెల్ లో ఉన్న పాలస్తీనా ఖైదీల మార్పిడి ఒప్పందం తో నాలుగు రోజుల శాంతి సంధి సాధ్యమైంది.అందుకు అమెరికా,ఈజిప్టు,ఖతార్ లు మధ్యవర్తిత్వం చేశాయి.మరిన్ని బేరసారాలతో ఇంకొన్ని రోజులు బాంబుల మోతలకు విరామం దొరకవచ్చు.అయితే ప్రపంచ దేశాలు ఈ స్వల్ప విరామాన్ని వినియోగించుకొని ఇరువురి మధ్య యుద్ధం ఆపే ప్రయత్నాలు చెయ్యాలి.వేలాది మంది పౌరులను చంపుతూ పోవడం ఉగ్రవాదం కన్నా మెరుగైనది కాదు.ఉగ్రవాదం పట్ల దేశాలకు నిష్పక్షపాత వైఖరి లేక పోవడం వల్ల అశాంతి ప్రపంచ వ్యాప్తం అయ్యింది.హమస్ మొదలెట్టిన మారణకాండ ఎంత నికృష్టమో,బదులుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధం అంతకన్నా ఎక్కువ నికృష్టం.హమస్ లాంటి సంస్థలు పాదుకొనడానికి ప్రపంచ స్వార్థ రాజకీయాలు ముఖ్య కారణం.ఆ మూలాల్లోకి పోకుండా అశాంతికి సొల్యూషన్ లు దొరకవు.ఉగ్రవాదం, యుద్ధ చర్యలు లాంటి ప్రమాదాలపై ప్రపంచ దేశాలది ఒకే మాట కావాలి.ఆ మాట పాటించేలా చూసే ఉమ్మడి వ్యవస్థ, కట్టుబాటు ఉండాలి.

**– డా. డి.వి.జి.శంకర రావు , మాజీ ఎంపీ, పార్వతీపురం. 94408 36931.**

# ఓటరు ఓసారి ఆలోచించు

ఢిల్లీ, కర్ణాటక పెద్దలు చెబితే మనం వినే ప్రభుత్వం రావాలా, లేదా మనం చెబితే ఢిల్లీ పెద్దలు వినే ప్రభుత్వం రావాలా...తెలంగాణ ఇచ్చింది అని చెప్పే మాటల్లో ఎంత వాస్తవం ఉందో ఒసారి ఆలోచిద్దాం. 2004లో తెలంగాణ ఇస్తామని, ఓ ప్రాంతీయ పార్టీతో పొత్తు పెట్టుకుని గెలిచాక ఇచ్చిన మాట వారి అలవాటు ప్రకారం గాలికొదిలారు. దీంతో ప్రాంతీయ పార్టీకి చెందిన పెద్దాయన అడిగి, అడిగి, విసిగి వేసారి చివరకు రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టి నిరాహార దీక్షకు పూను కోవడంతో, యావత్ తెలంగాణ జాగృతిమై ముఖ్యంగా విద్యార్థులు తమ రాష్ట్ర సాధన కొరకు వారి ప్రాణాబలిదానాలు చేసుకుంటుండడం, మరోపక్క ప్రభుత్వ ఉద్యోగులు, అడ్వకేట్ సోదరులతో మొదలుకొని అందరూ రాష్ట్ర సాధనకు పోరు బాట పడితే... మరో అవకాశం లేక ప్రకటించారు. దీనిని ఇచ్చారందామా లేక తెచ్చుకున్నము అందమ ఓసారి ఆలోచించండి. ఓ వాస్తవం 2004 నుండి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ని పాలించిన ప్రభుత్వం మొత్తం పదేళ్లలో 24 వేల ఉద్యోగాలు ఇవ్వగా, అందులో 42 శాతం వాటా తెలంగాణ గనుక 14 వేల ఉద్యోగాలు ఇచ్చింది అనుకుందాం, అదే గత పదివేలు పాలించిన ప్రభుత్వం అక్షరాల ఒక లక్ష అరవై వేల (1,60,000) ఉద్యోగాలు ఇచ్చింది. భారత దేశంలోనే మరె రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఇంత పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవు. అంతేకాకుండా అదనంగా ఇంకా 70000 ఉద్యోగాలు ప్రక్రియలో ఉన్నాయ్ అంటుంది. సరే దాన్ని వదిలేద్దాం. పదేళ్ల పాలనలో 14 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారా లేక పదేళ్లల పాలనలో 1,60,000 ( ఒక లక్ష అరవై వేలు) ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారా అన్నది ఎంతో విజ్ఞత కలిగిన హైదరాబాద్, రాష్ట్ర యువత ఓసారి ఆలోచించాలి. మాటలే కాని, చేతలు కావని తెలిసిందంటూ సొంత నియోజకవర్గ ప్రజలే ఓటమి పాలు చేస్తూ తంతే.. పట్టణంలో మళ్లీ కల్లబొల్లి మాటలతో వెంట్రుకవాసులో గెలిచిన వ్యక్తి కనీసం ఒక్కసారి కూడా మంత్రి పదవి అధిరోహించని వ్యక్తి తానే ముఖ్యమంత్రి గా రాష్ట్రాన్ని పరిపాలిస్తానంటూ కల్లబొల్లి మాటలు చెబుతూ గాలి వచ్చిందంటూ, గాలి గాండ్లు చెప్పే గాలి మాటలు నమ్మి ఢిల్లీ, కర్ణాటక పెద్దలకు మళ్లీ బానిసలమవుదామా... ఇక మనకు రావలసిన సరైన కృష్ణ నీళ్లు, ఐటీ కంపెనీలు కర్ణాటకకు మరలిపోకుండా ఉంటాయంటారా? ఎందుకంటే స్వాతంత్రం వచ్చినప్పటి నుండి భారతదేశంలో ఐటీ ఉద్యోగాలు పొందటంలో బెంగళూరు మొదటి స్థానంలో కొనసాగుతుంది. అయితే గత రెండు సంవత్సరాలుగా ఐటీ ఉద్యోగుల నియమాకాల్లో బెంగళూరు కన్నా మన హైదరాబాద్ భారతదేశంలోనే మొదటి స్థానంలో కొనసాగుతుంది ప్రస్తుత ప్రభుత్వ కృషివల్లే అన్న వాస్తవం చెప్పక తప్పదేమో...






# నేడు రాజస్థాన్‌లో పోలింగ్

● 199 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు ● బరిలో 1875 మంది అభ్యర్థులు
● వోటు హక్కు వినియోగించుకోనున్న 5.25 కోట్ల మంది ● 51756 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శనివారం జరగనున్నది. సుమారు నెలన్నర రోజుల నుంచి జరుగుతున్న ఎన్నికల ప్రచారానికి గురువారం సాయంత్రంతో ముగింపు పడింది. రాజస్థాన్‌లో మొత్తం 200 నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ సారి 199 నియోజకవర్గ స్థానాలకు గాను ఒకే రోజు పోలింగ్ జరగనుంది. అయితే, రాష్ట్రంలో మొత్తం ఈసారి 5.25 కోట్ల మంది వోటర్లు తమ వోటు హక్కు వినియోగించుకోనున్నాను. ఆ 5.25 కోట్ల మంది వోటర్లకు 51756 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ అధికారులు ఏర్పాటు చేశారు. ఆ ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 3న ఎన్నికల కమిషన్ విడుదల చేస్తుంది. అయితే, రాజస్థాన్‌లో ఎన్నికల కోడ్ అమల్లైనప్పటి నుంచి, గురువారం వరకు మొత్తం రూ. 682 కోట్లను అధికారులు సీజ్ చేశారు. రాష్ట్రంలో మొత్తం 1875 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ సారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. వారిలో 183 మంది స్త్రీ అభ్యర్థులు నిలువవగా, 1692 మంది పురుష అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో పోటీ చేయనున్నారు. జోత్వారా అసెంబ్లీ సెగ్మెంట్లో ఎక్కువగా 18 మంది అభ్యర్థులు, లాల్సోట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యంత తక్కువగా ముగ్గురు అభ్యర్థులు ఎన్నికల పోటీలో నిలిచారు. రాష్ట్రంలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 99 అసెంబ్లీ సీట్లను, బీజేపీ 73 అసెంబ్లీ సీట్లను గెలుచుకున్నాయి.

**తొలిసారిగా తమ వోటు వేయబోతున్న గ్రామస్థులు** : అయితే, ఈ ప్రాంతంలోని ఒక నియోజకవర్గంలోని వోటర్లు మాత్రం స్వాత్రంత్యం వచ్చిన తరువాత తొలిసారిగా వారు తమ వోటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆ నియోజకవర్గం పేరు అబు పింద్వారా. ఆ ప్రాంతం 4921 అడుగుల ఎత్తులో ఉంది. అక్కడ నివసించే షేర్గావ్ ప్రజలు మొట్టమొదటిసారిగా తమ పోలింగ్ బూత్‌లో శనివారం తమ వోటు హక్కు వినియోగించుకోనున్నారు. 35 మంది వోటర్లు ఉన్న



బార్మర్ కా పార్, 49 మంది వోటర్లు ఉన్న మంఝోలి, 50 మంది వోటర్లు ఉన్న కంటల్ కా పార్ గ్రామాల్లోనూ ఈసారి పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు ఏవైనా జరిగేందుకు ఆస్కారం లేకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భారత హైకమిషన్ జోక్యంతో శ్రీలంక జైలు నుంచి
# మత్స్యకారులు విడుదల

న్యూఢిల్లీ: కొలంబోలోని భారత హైకమిషన్ జోక్యంతో 15 మంది భారతీయ జాలర్లను శ్రీలంక జైలు నుంచి విడుదల చేశారు. తమిళనాడుకు చెందిన 15 మంది మత్స్యకారులు మంగళవారం చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు, వారికి భారతీయ జనతా పార్టీ తమిళనాడు యూనిట్ సభ్యులు ఘనస్వాగతం పలికారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో సమాచారం ఇస్తూ, శ్రీలంకలోని భారత హైకమిషన్, హోమ్‌కమింగ్! 15 మంది భారతీయ మత్స్యకారులు శ్రీలంక నుండి వారి మాతృభూమికి సురక్షితంగా తిరిగి వచ్చారు. 15 మంది మత్స్యకారులు, రెండు మెకనైజ్డ్ బోట్లలో, నవంబర్ 14 న రామేశ్వరం నుండి చేపల వేటకు బయలుదేరారు, అయితే శ్రీలంక జలాల్లోకి ప్రవేశించారనే ఆరోపణతో అరెస్టు చేశారు. అయితే, ఈ విషయంలో, ఎప్పటిలాగే, పొరుగు దేశంలో ఉన్న భారత హైకమిషన్ సత్వరాన్ని చూపింది మరియు శ్రీలంక పరిపాలన మరియు నేవీతో మెరుగైన సమన్వయాన్ని ఏర్పరచడం ద్వారా మత్స్యకారులను వారి స్వదేశానికి తిరిగి వచ్చేలా చేసింది. తమిళనాడు తీరప్రాంతం నుంచి రోజూ వందలాది మంది మత్స్యకారులు జీవనోపాధి కోసం సముద్రంలో చేపల వేటకు వెళ్లడం గమనార్హం. అయితే, కొన్నిసార్లు వాతావరణంలో మార్పుల కారణంగా వారు తమ దారిని కోల్పోయి శ్రీలంక జలాల్లోకి ప్రవేశిస్తారు. అటువంటి పరిస్థితిలో, శ్రీలంక నావికాదళం వారిని అరెస్టు చేసింది. అయితే, శ్రీలంకలోని భారత హైకమిషన్ ఎల్లప్పుడూ ఇటువంటి విషయాలను తీవ్రంగా పరిగణిస్తుంది మరియు భారతీయ మత్స్యకారులకు సహాయం చేయడానికి సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తుంది.

## వచ్చే వారం బంగాళాఖాతంలో తుపాను

● ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
● దక్షిణ అండమాన్ సముద్రాన్ని ఆనుకుని అల్పపీడనం ఏర్పడే అవకాశం ● 29 నాటికి వాయుగుండంగా మారుతుందన్న ఐఎండీ అమరావతి కేంద్రం



అమరావతి : బంగాళాఖాతంలో తుపాను ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 27 నాటికి దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగళాఖాతాన్ని ఆనుకుని అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఐఎండీ అమరావతి కేంద్రం వెల్లడించింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనించి ఈ నెల 29 నాటికి వాయుగుండంగా బలపడుతుందని తెలిపింది. ఇది తుపానుగా మారే అవకాశాలు ఉన్నట్లు ప్రైవేట్ వాతావరణ సంస్థల నమూనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతానికి దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని ఐఎండీ వివరించింది. అటు, గడచిన 24 గంటల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. కేరళలోని కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదైంది. తమిళనాడులోని మెట్టుపాళయంలో అత్యధికంగా 37 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది.

# గవర్నర్‌కు అధికారం లేదు

● బిల్లులను పెండింగ్‌పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు ● 10న పంజాబ్ గవర్నర్ అంశంపై సుప్రీం తీర్పు



న్యూఢిల్లీ : అసెంబ్లీ సిఫారసు చేసిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా ఉద్దేశపూర్వకంగా తొక్కిపెడుతున్నారని పంజాబ్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం పంజాబ్ గవర్నర్ అంశంపై ఈ నెల 10న తీర్పు వెలువరించింది. ఆ తీర్పు ప్రతిని తాజాగా సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆ తీర్పులో సుప్రీం ధర్మాసనం గవర్నర్ అధికారాలపై కీలక వ్యాఖ్యలు చేసింది. 'గవర్నర్ ఎన్నికల ప్రక్రియ ద్వారా పదవిని చేపట్టకపోయినప్పటికీ రాజ్యాంగబద్ధంగా కొన్ని అధికారాలు ఉంటాయి. కానీ, ఆ అధికారాలకు పరిమితి ఉంది. అసెంబ్లీలు రూపొందించిన చట్టాలను అడ్డుకునే అధికారం గవర్నర్‌కు లేదు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా వాటిని పెండింగ్‌లో ఉంచే అధికారం గవర్నర్‌కు ఉండదు. రాష్ట్రపతి నియమించే గవర్నర్ రాష్ట్రానికి నామమాత్రపు అధిపతి మాత్రమే. పాలన పరమైన నిర్ణయాలను గవర్నర్ తీసుకోలేడు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకే పాలన పరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు గవర్నర్ మార్గదర్శిగా మాత్రమే వ్యవహరించాలి. ప్రజాస్వామ్య సుస్థిరతకే ఇదే పునాది' అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

# అవినీతి కేసీఆర్‌ను గద్దె దింపాల్సిందే

● కేసీఆర్ ఇచ్చిన ఒక్క మాట, హామీని నెరవేర్చలేదు ● నిజామాబాద్ జిల్లాలో బీడీ వర్కర్స్ కోసం ప్రత్యేక హాస్పిటల్ ● ఉత్తర తెలంగాణ నుంచి వెళ్లిన గల్ఫ్ బాధితుల కోసం ఎన్ఆర్ఐ పాలసీ ఇచ్చాం
● కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఇచ్చిన ఒక్క మాట, హామీని కేసీఆర్ నెరవేర్చలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఆర్మూర్ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. టర్మరిక్ బోర్డు ఇచ్చింది బీజేపీ అని చెప్పుకొచ్చారు. నిజామాబాద్ జిల్లాలో బీడీ వర్కర్స్ కోసం ప్రత్యేక హాస్పిటల్, ఉత్తర తెలంగాణ నుంచి వెళ్లిన గల్ఫ్ బాధితుల కోసం ఎన్ఆర్ఐ పాలసీ ఇచ్చామన్నారు. బీజేపీ సర్కార్‌లో హైదరాబాద్ విమోచన దినం జరువుతామని వెల్లడించారు. దళిత ముఖ్యమంత్రి అని చెప్పి కేసీఆర్ మాట తప్పారన్నారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. జీఎస్టీ మార్పులు తీసుకువస్తామని.. ఏడాదిలో నాలుగు గ్యాస్ సిలిండర్ ఉచితంగా అందిస్తామన్నారు. డబ్బులు ఎక్కువగా ఎవరు ఇస్తే కేసీఆర్ మంత్రి వర్గంలో వారే ఉంటారని తెలిపారు. అవినీతి కేసీఆర్‌ను గద్దె దింపాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించి, పేపర్ లికేజి ఘటనపై విచారణ జరిపి జైల్‌కు పంపుతామని స్పష్టం చేశారు. కేసీఆర్ కార్ స్టీరింగ్ ఓవైసీ చేతిలో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీతో సుపరిపాలన సాధ్యం కాదని అన్నారు. కాంగ్రెస్‌లో కేవలం మంత్రి పదవి పొందాలంటే ఢిల్లీలో చర్చించాలి అని.. అలాంటి పార్టీ అవసరమా అని అమిత్ షా ప్రశ్నించారు.

# లెక్కలు పక్కా

● మ్యాజిక్ ఫిగర్ సాధనపై కెసిఆర్ లోతైన విశ్లేషణ ● పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు సైతం కేసిఆర్‌తో టచ్‌లో ఉన్నట్టు అభిప్రాయం ● మజ్లిస్ మద్దతుతో కెసిఆర్ మ్యాజిక్ ఫిగర్ 53 సీట్లు మాత్రమే
● కాంగ్రెస్ వాళ్లు కొందరు కలిసి వస్తే అధికారం నల్లేరు మీద నడక చందం
● ప్రచారం చివరి అంకంలో పకడ్బందీ వ్యూహాలు ● అభ్యర్థులకు ప్రత్యేకంగా దిశా నిర్దేశం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల ప్రచారం ప్రధాన పార్టీల మధ్య రక్తి కడుతోంది. పాలక పక్షమైన భారత రాష్ట్ర సమితి పార్టీతో కాంగ్రెస్ పార్టీ ఢీ అంటే ఢీ అనే రీతిలో దూసుకెళ్తుండడమే దీనికి కారణం. రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు, అనంతరం సంబంధించిన వర్ణమాలతో ఏకంగా సమీకరణలే మారిపోయాయి. ఎన్నికల్లో హాట్ ఫేవరెట్ గా భారత రాష్ట్ర సమితి తాజాగా కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటున్నది. భారత రాష్ట్ర సమితి పార్టీ అధినేత మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దిద్దుబాటు చర్యలకు దిగుతున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో అధికారాన్ని కాంగ్రెస్ పార్టీకి వదులుకునేందుకు గులాబీ పార్టీ అధినేత సిద్ధంగా లేరు. రాష్ట్రంలో ఇరు పార్టీల ఎన్నికల పోరాటం యుద్ధ వాతావరణంను తలపింప చేస్తున్నది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికలలో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందువల్లనే జాతీయ మరియు వివిధ రాష్ట్రాలలోని కాంగ్రెస్ పార్టీ దిగ్గజాలను రంగంలోకి దింపింది. హోరా హోరీ ప్రచారానికి తెరలేపింది. ఫలితంగానే ఎన్నికల వాతావరణం వేడెక్కింది .పాలకపక్షానికి గట్టి సవాల్ కాంగ్రెస్ రూపంలో ఎదురవుతోంది. తొలుత 80 నుంచి 90 సీట్లు సాధిస్తామని బి ఆర్ ఎస్ పార్టీ ధీమాగా ఉంది. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి మ్యాజిక్ ఫిగర్ అయినా 60 సీట్లకు చేరుకున్న సరిపోతుంది అనే అంచనాలో ఉన్నట్లు సమాచారం. 70 సీట్లకు తగ్గకుండా తాము సాధిస్తామని బి. ఆర్ .ఎస్ అగ్ర నాయకులు చెబుతున్నారు. వాస్తవానికి అనువ్యమైన రీతిలో

తెలంగాణలో ఎన్నికల రాజకీయం మారుతోంది. కాంగ్రెస్ వర్సస్ బీఆర్ఎస్ ఉత్కంఠ పోరులో లెక్కలు మారుతున్నాయి. ఇరు పార్టీలలో కూడా గట్టి పోటీ ఉన్నప్పటికీ అంతిమ విజయం తమదే అని బి. ఆర్. ఎస్ ముఖ్య నేతలు ఘంటాపతంగా చెబుతున్నారు. కాంగ్రెస్ కు అనుకూలంగా పరిస్థితి ఉందనే అంచనాలు అధికమయ్యాయి. ఈ సమయంలో బీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తూనే, తమ పైన ఉన్న విమర్శలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తోంది. తమకు దూరమయ్యారని గుర్తించిన వర్గాలను దగ్గర తీసుకొనే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ కు 80 సీట్లు వస్తాయని, ఒక్క సీటు కూడా తగ్గదని కాంగ్రెస్ నేత రేవంత్ సవాల్ చేస్తున్నారు. కాంగ్రెస్ పాలన వస్తే ప్రయోజనం ఏంటని కేసీఆర్, కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ ను గెలిపించాలా, ఓడించాలా అనే అంశం పైనే ప్రధానంగా ఎన్నిక జరుగుతోందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలన తమకు హ్యాట్రిక్ విజయం తెచ్చి పెడుతుందని విశ్వసించిన గులాబీ నేతలు గ్రౌండ్ నుంచి వస్తున్న నివేదికలతో అప్రమత్తం అయ్యారు. కేసీఆర్ కుటుంబం అహంకార ధోరణి అంటూ చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లిందా అనే చర్చ మొదలైంది. తాజాగా మంత్రి కేటీఆర్ తమ పైన వస్తున్న విమర్శలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసారు. తెలంగాణ మీద కేసీఆర్కు ఉన్నది మమకారమని, అహంకారం కాదని చెప్పుకొచ్చారు. అదే సమయంలో ధరణి పైన కాంగ్రెస్ ను రోజు ముఖ్యమంత్రి కేసీఆర్ టార్గెట్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేస్తారని ప్రతీ సభలోనూ చెబుతున్నారు. ధరణి రద్దు చేస్తే వచ్చే నష్టాలను వివరిస్తున్నారు. ఇప్పుడు కేటీఆర్ ధరణి గురించి ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. ధరణి పోర్టల్ లో చిన్న చిన్న చిక్కులు, చికాకులు ఉన్నాయని అంగీకరించారు. అధికారంలోకి వచ్చిన తరువాత దీని పైన ఒక నిపుణుల సంప్రదింపుల కమిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎలుకలు ఉన్నాయని ఇంటిని తగలబెట్టుకుంటామా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా యువతతో కేటీఆర్ సమావేశమైన సమయంలో టీఎస్పీఎస్సీ నోటిఫికేషన్లు, ఉద్యోగాల భర్తీ పైన ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆ సమయంలోనూ కేటీఆర్ వారిని బుజ్జగించే ప్రయత్నం చేసారు. విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా టీఎస్పీ ఎస్సీని మార్చుతామని హామీ ఇచ్చారు. తానే స్వయంగా విద్యార్థులతో చర్చించి టీఎస్పీఎస్సీ జాబ్ క్యాలెండర్ రూపొందిస్తామని చెప్పుకొచ్చారు. ఇక, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సైతం తమ సొంత నియోజకవర్గ కేడర్ కు అందుబాటులో ఉంటామని హామీలు ఇస్తున్నారు. తాము ఎవరినీ కలవమనే అభిప్రాయం స్థానిక నేతల్లో ఉన్నట్లు గుర్తించటంతో ఎన్నికల వేళ వారిని సరిదిద్దుకొనే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ఇప్పుడు ఈ ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయి, ఫలితాలు ఎలా ఉంటాయనేది ఆసక్తికరంగా మారినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు మాత్రం హ్యాట్రిక్ విజయం సాధించడం పై దృష్టిపెట్టారు. వాస్తవానికి మ్యాజిక్ ఫిగర్ 60 సీట్లు మాత్రమే. అయితే అధికారాన్ని చేజిక్కించుకోవడానికి భారత రాష్ట్ర సమితి పార్టీకి 53 సీట్లకు తగ్గకుండా గెలుచుకుంటే సరిపోతుంది. ఎందుకంటే మజ్లిస్ పార్టీ భారత రాష్ట్ర సమితి పార్టీకి బహిరంగంగా మద్దతు ప్రకటిస్తున్నది. ఆ పార్టీకి కనీసం ఏడు సీట్లకు తగ్గకుండా గెలుచుకునే సామర్థ్యం ఉంది. అందువల్లనే మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి పాలక పక్షానికి పెద్దగా ఇబ్బంది ఉండబోదనే విశ్లేషకుల అంచనా. పైగా కాంగ్రెస్ పార్టీలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న పలువురు అభ్యర్థులు భారత రాష్ట్ర సమితి పార్టీ అధినాయకత్వంతో టచ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కూడా మంత్రి కేటీఆర్ బహిరంగంగా ప్రకటించడం మరో విశేషం. ఈ లెక్కన పాలక పక్షానికి కాంగ్రెస్ రూపంలో మరో 10 నుంచి 20 సీట్ల వరకు లాబించే అవకాశాలు లేకపోలేదు. గెలిచిన కాంగ్రెస్ వాళ్లలో పలువురు భారత రాష్ట్ర సమితి లో చేరేందుకు, ఎన్నికల అనంతరం ముహూర్తం కూడా పెట్టుకున్నట్టు చెప్తున్నారు. అందువల్లనే ముఖ్యమంత్రి కేసీఆర్ అధికార సాధన పై ఎంతో ధీమాగా ఉన్నారు. ఇప్పటికే కచ్చితంగా గెలిచే సీట్ల జాబితా కేసీఆర్ వద్ద ఉంది. కాంగ్రెస్ పార్టీకి 20 సీట్లు మించి రావని భారత రాష్ట్ర సమితి నాయకత్వం సూత్రీకరిస్తున్నది. ఈ విశ్లేషణలో పకడ్బందీ లెక్కలు ఉన్నట్టు సమాచారం. సమకాలిన రాజకీయాలలో అపర చాణిక్యరీతి కెసిఆర్ ది. ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండానే తన చాణక్యంతో కేసీఆర్ రెండుసార్లు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అధి కారంలోకి రావడం జరిగింది. మూడోసారి కూడా అధి కారంలోకి వస్తామని నమ్మకంగా ఉన్నారు. ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరింది. పద్యంలో రోజు రాత్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో టచ్‌లో ఉంటున్నారు. ఎంత ఖర్చైనా సరే గట్టిగా గెలిచి తీరాలని దిశా నిర్దేశం చేస్తున్నారు.

## తెలంగాణలో తాలిబాన్ల పాలన



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఆఫ్ఘానిస్తాన్‌ను తలపించేలా తెలంగాణలో తాలిబాన్ల పాలన ఉందని వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవ చేశారు. శుక్రవారం నాడు షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్.. తెలంగాణలో పదేళ్లుగా సాగింది సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధి కాదు.. అవినీతి, దోపిడీ, దౌర్జన్యాలతో కూడిన నియంత పాలన. 5 లక్షల కోట్లు అప్పులు చేసి, ఒక్కోక్కరి నెత్తిమీద 2 లక్షల అప్పు మోపారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరిగిందని ప్రజెంటేషన్లు ఇచ్చుకోవడానికి సిగ్గుండాలి. దేశంలో ఉద్యోగాల కల్పనలో రాష్ట్రం నెంబర్ 1 ఉంటే.. నిరుద్యోగులు 50 లక్షల మంది ఎందుకున్నట్లు? ఉద్యోగాలిస్తే వందలాది మంది ఆత్మహత్యలు ఎందుకు చేసుకున్నారు అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు.

పదేళ్లలో పట్టుమని 65 వేల ఉద్యోగాలు ఇవ్వడం మీకు చేతకాలేదు. ఇంటికో ఉద్యోగం ఇచ్చినట్లు, నిరుద్యోగులను ఉద్ధరించినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారు. బహిరంగ చర్చకు రావాలి అని సవాల్ విసురుతున్న మీ తీరుకు నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదు. మీ దరిద్రపు పాలనలో టీఎస్పీఎస్సీ లీకుల బాగోతం దేశమంతా ఎరుకే. ఇంకా నిరుద్యోగులు మిమ్మల్ని నమ్ముతారని కల్లబొల్లి కబుర్లు చెప్పడం మీ అవివేకానికి నిదర్శనం అని వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

## సింగరేణి సంస్థను ముంచిందే కాంగ్రెస్




భూపాలపల్లి సూర్యప్రతినిధి : సింగరేణి సంస్థను ముంచేసింది కాంగ్రెస్ పార్టీయేనని కానీ కార్మికుల పక్షాన నిలబడి 15000 డిపెండింగ్ ఉద్యోగాలు ఇచ్చింది మేమేనని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకట రమణారెడ్డి టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి రెడ్డిల ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గం ప్రజలు ఆలోచించాలి ఎవరు నిలుచుంటే ఎమ్మెల్యేగా ఉంటే అభివృద్ధి జరుగుతుందో ఎవరి చేతుల్లో ఈ రాష్ట్రం సురక్షితంగా ఉంటుందో నిర్ణయం తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. మన అభ్యర్థి వెంకటరమణారెడ్డి వ్యక్తిత్వాన్ని చూడాలన్నారు. బిఆర్ఎస్ చరిత్ర మీకు తెలుసు, మీ కళ్ళ ముందే వుట్టిన ఈ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులను పరిరక్షించుకునేందుకు తెలంగాణ అభివృద్ధి చేసేందుకే మీ ముందుకు వచ్చిందని 15 సంవత్సరాల సుదీర్ఘ రాజీలేని పోరాటాల అనంతరం తెలంగాణ సాధించుకున్నామని ఆ తర్వాత అనేక రంగాల్లో మంచి పనులు చేసుకుని గతంలో ప్రధాన సమస్యలుగా ఉన్న మంచినీటి సమస్యలను తీర్చుకున్నామని వ్యవసాయ రంగాన్ని గతంలో కంటే మెరుగ్గా బాగు చేసుకున్నామని పేదల సంక్షేమం కోసం ఆసరా పెన్షన్లు లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టుకున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అన్నారు. రమణారెడ్డి ని గెలిపించి తిరిగి అసెంబ్లీకి పంపిస్తే ఆసరా పెన్షన్లు 5000 వరకు పెరుగుతాయని రైతాంగం గురించి ఆలోచించి కూడా కాల్వల ద్వారా కూడా వ్యవసాయ పంటలు పండిస్తే పన్నులు వేసే పరిస్థితి ఉండే 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్నామని దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు రైతుబంధు వుట్టించిందే కేసిఆర్ అన్నారు. రైతు మరణించిన వారం రోజులలోపే ఐదు లక్షల ప్రమాద బీమా అందిస్తున్నామని మీరు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నష్టం వాటిల్లినప్పటికి నేరుగా కల్లాల వద్దనే కొంటుందన్నారు కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారురేవంత్ రెడ్డి అంటున్న మాటలు ప్రజలు ఒకసారి ఆలోచించాలని రైతుబంధు కొనసాగాలంటే రమణారెడ్డిని గెలిపించి పంపించండి 10,000 ఉన్న రైతుబంధును 16000 చేస్తామని అన్నారురేవంత్ రెడ్డి మూడు గంటల కరెంటు చాలు అంటున్నాడు మళ్ళీ వెంకటరమణారెడ్డిని గెలిపించి పంపించండి 24 గంటల విద్యుత్ ఇలాగే కొనసాగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తారంట విజ్ఞులైన ప్రజలందరూ ఆలోచించాలని ఇది రైతులకు జ్జీవన్మరణ సమస్య అని ముఖ్యమంత్రి అన్నారుభూపాలపల్లి నియోజకవర్గ ప్రజలందరూ ఆలోచించి గండ్ర వెంకటరమణ రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి అసెంబ్లీకి పంపించాలని ప్రజలను కోరారు.



# రేపు కార్తీక పర్వదీపోత్సవం

తిరుమల మేజర్ న్యూస్ : తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవం జరుగనుంది. ప్రతి సంవత్సరం తిరుమల శ్రీవారి అలయంలో కార్తీకమాసంలో కార్తీకదీపోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తి అయిన తరువాత ఈ దీపోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం 5 నుండి 8 గంటల వరకు నేతి వత్తులతో దీపాలను వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనందనిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఆ తర్వాత వరుసగా గర్భాలయంలో అఖండం, కులశేఖరపడి, రాములవారిమేడ, ద్వారపాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళామాత, బంగారుబావి, కల్యాణమండపం, సభేర, తాళ్లపాకవారి అర, భాష్యకారుల సన్నిధి, శ్రీయోగనరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయ మండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, శ్రీ బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి వద్ద దీపాలు వెలిగిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో సహస్రదీపాలంకరణ సేవను టీటీడీ రద్దు చేసింది.

**ఈ నెల 27న పౌర్ణమి గరుడసేవ**

పౌర్ణమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 27న సోమవారం గరుడసేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా రాత్రి 7 నుండి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు.

# స్వయం ప్రకటిత చక్రవర్తిలా జగన్ రెడ్డి నియంత పోకడలు



- హైకోర్టు తీర్పుల్ని ధిక్కరిస్తూ ప్రభుత్వ కార్యాలయాల తరలింపు
- రూ.433 కోట్ల ప్రజల డబ్బుతో భారతీ రెడ్డికి పుట్టిన రోజు కానుకా?
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు

గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : ఇక్కడే ఇల్లు కట్టుకున్నా, అమరావతినే రాజధానిగా కొనసాగిస్తానని చెప్పి జగన్ రెడ్డి గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల్ని నమ్మించి మోసం చేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఉత్తరాంధ్రకు మకాం మారుస్తున్నా ఉత్తరాంధ్ర ప్రజల జీవితాలు మార్చేస్తా అంటూ మరోమోసానికి సిద్ధమయ్యారని, హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ తన నియంతృత్వ పోకడలను చాటుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన మిలీనియం టవర్స్ బలవంతంగా ఖాళీ చేయించడం జగన్ రెడ్డి పెత్తందారీ విధానాలకు నిదర్శనం. ఇక్కడి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు నాశనం చేసి ఇక్కడకు సీఎం వచ్చి ఏం సాధిస్తారు.? దాదాపు 40వేల కోట్ల విలువైన 70వేల ఎకరాల భూముల్ని ఉత్తరాంధ్రలో కబ్జా చేశారన్నారు. విశాఖలోని ప్రభుత్వ భూముల్ని తాకట్టు పెట్టి రూ.25వేల కోట్ల అప్పులు తెచ్చుకున్నారు. ఐటీ కంపెనీల ను తరిమేశారు. లులూ, అదానీ డేటా సెంటర్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, కాండ్యుయెంట్ లాంటి ప్రఖ్యాత కంపెనీల పెట్టుబడులు దూరం చేశారు. ఏం ఉద్ధరిద్దామని విశాఖకు మకాం మారుస్తున్నారో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. ఎన్నికల ముందు అమరావతే రాజధాని అని ప్రకటించి, అధికారంలోకి వచ్చాక భూములిచ్చిన రైతుల ఉసురు తీశారు. దాడులు చేసి, కేసులు పెట్టి, అరాచకం సృష్టించారు. ఇప్పుడు ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడానికే విశాఖకు మకాం మార్చానని చెప్పడం హాస్యాస్పదం. జగన్ రెడ్డి ఎన్ని మాయ మాటలు చెప్పినా, ఎన్ని కబుర్లు చెప్పినా నమ్మేందుకు ఉత్తరాంధ్ర ప్రజలు సిద్ధంగా లేరని గుర్తుంచుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

**MUTHOOT FINCORP LTD. | బంగారం వేలం ప్రకటన**

Regd. Office: Muthoot Centre, TC No 27/3022, Punnen Road, Thiruvananthapuram, Kerala, India - 695001. CIN : U65929KL1997PLC011518, Ph: +91 471 4911400, 2331427

దిగువ శాఖలనుండి 31.12.2022 & MSGL, SPL-16, One plus, Guide Prepaid, Super value, ADGL and all other 6 months tenure Gold loans up to 31.03.2023 and MSGB, SME Suvarna & EMI due up to 30.09.2023 వరకు బంగారు నగలపై రుణం తీసుకున్నవారందరికీ ఈ నోటీసు మూలంగా తెలియజేయునది ఏమనగా తాకట్టు పెట్టిన నగలు విడిపించుకునే గడువు ముగిసినందువలన మరియు పలుసార్లు నోటీసులు పంపబడినా విడిపించుకోనందువలన తాకట్టు పెట్టబడిన ఆభరణాలు 05.12.2023 ఉ.10.00 గంటల నుండి వేలం వెయ్యబడతాయి.
**MULUGU DISTRICT - MULUGU-WARANGAL:** F26445, F38497, F38619, F38629, F38630, F38901, F38974, F39004, F39128, F39204. **WARANGAL(RURAL) DISTRICT - NARSAMPET:** F47581, F47990, F48012, F48071, F48134, F48150, F48297, F48322, F48607. **PARKAL:** F18772, F18949, F18986. **WARANGAL (URBAN) DISTRICT - BHIMDEVARAPALLI-KARIM NAGAR:** F18289, F18391, F18462, F18531, F18566, F18584, F18643, F19835, F19845, F19863, F19882. **HANMAKONDA - KUX ROAD:** F3783, F3799, F3804, F3922. **HANMAKONDA:** F60569, F61031, F61094, F61270. **KAZIPET:** F25555, F25710, F25789. **WARANGAL - J P N ROAD:** F13787, F15690, F15706, F15750, F15839, F15850, F15868, F15903, F16056. **WARANGAL-M.G.ROAD:** F20047, F20062, F20191, F20213. **WARANGAL-UNDER BRIDGE ROAD:** F12173, F12227, F12604, F18634, F18701, F18737, F19756, F19784. **WARANGAL:** F65836, F65841, F65843.
వేలం సంబంధిత శాఖలలో నిర్వహించబడుతుంది. ఒకవేళ ఏదైనా కారణాల వలన ఆరోజు వేలం ముగియనట్లయితే, 16.12.2023 ఉ.10.00 గం.లకు **NARSAMPET:** Muthoot FinCorp Ltd., First Floor, Srinivas Residencial, HNo 1-118-20, Survey No: 797, Warangal Road, Above HDFC Bank, Narsampet, Telangana - 506132. **WARANGAL-UNDER BRIDGE ROAD:** Muthoot FinCorp Ltd., First Floor, 16-10-1390, Under Bridge Road, None Old SBH Bank, Shiva Nagar, Telangana - 506002. **MULUGU-WARANGAL:** Muthoot FinCorp Ltd., 6-57, First Floor, Opposite HDFC Bank, Beside UNION Bank Mulugu, Telangana - 506343. లో వేలం వెయ్యబడతాయి. వేలంలో పాల్గొనే వేలందారులు తమ ఫోటో ఐడి కార్డు, ప్యాన్ కార్డుని చూపించాలి. వేలంపాట పాడినవారు నగదు మొత్తాన్ని RTGS ద్వారా కంపెనీ ఖాతాకు బదిలీ చెయ్యాలి. ముథూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్

## జగన్ పాలన ఎక్స్పైరీ డేట్
# మూడు నెలలు మాత్రమే

**టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్**



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : కోర్టు ఆదేశాలున్నా ప్రభుత్వ కార్యాలయాల్ని విశాఖ తరలించేందుకు ఏపీ సీఎం జగన్ జీవోలు ఇస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం అమరావతిలో సెక్రటేరియట్ కట్టిందని, అందులో కూర్చుని జగన్ ఇదేం రాజధాని అంటున్నారని విమర్శించారు. ఐటీ అభివృద్ధికి కట్టిన మిలేనియం టవర్స్ను ఖాళీ చేయిస్తున్నారు. వేల కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే కంపెనీలను తరిమేస్తున్నారు. రుషికొండను ధ్వంసం చేశారు. కైలసగిరిని నాశనం చేశారు. జగన్ పాలన ఎక్స్పైరీ డేట్ మూడు నెలలు మాత్రమే. మూడు నెలల ముచ్చట కోసం వేల కోట్లు తగలేస్తున్నారని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చట్టాలు తుంగలో తొక్కుతున్న పోలీసులారా జాగ్రత్త

**తెలుగుదేశం అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు**



మంగళగిరి, సూర్య ప్రధాన ప్రతినిధి : సీఎం జగన్ రెడ్డి కళ్లల్లో ఆనందం చూడటానికి చట్టాలు తుంగలో తొక్కుతున్న పోలీసులారా జాగ్రత్త. కొందరు పోలీసులు చట్టవ్యతిరేకులుగా మారడానికి ముఖ్యమంత్రే కారణమని తెలుగుదేశం అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి పోలీస్ శాఖతో ఎలాంటి విరోధం లేదని, జగన్ తొత్తులుగా మారి బరితెగించి ప్రవర్తించే వారితోనే తమ పోరాటమని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో సమర్థవంతంగా పనిచేసి, శాంతిభద్రతల పరిరక్షణలో దేశస్థాయిలో ప్రశంసలు పొందిన పోలీస్ శాఖ నేడు ఎందుకిలా దిగజారిపోయిందని ప్రశ్నించారు. పరిధిదాటి చట్టవిరుద్ధంగా జగన్ కోసం పనిచేసే పోలీసులు టీడీపీ అధికారంలోకి వచ్చాక తమ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలన్నారు. తప్పుచేసిన ప్రతి పోలీస్ అధికారి కచ్చితంగా న్యాయస్థానాల ద్వారా శిక్షింపబడటం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర బెయిల్ విచారణ కోర్టులో కొనసాగుతుంటే పోలీసులు ఆయన అరెస్టుకు అత్యుత్సాహం చూపడమేంటని పిల్లి మాణిక్యరావు మండిపడ్డారు. ప్రొక్లెయిన్లు తీసుకెళ్లి మరీ అక్కడి భద్రతా సిబ్బందిని, స్థానికుల్ని భయభ్రాంతులకు గురిచేయడం జగన్ మార్క్ పాలన కాదా? అని ప్రశ్నించారు. ధూళిపాళ్లను అరెస్ట్ చేయడానికి వెళ్లిన పోలీసులకు ఛాలెంజ్ చేస్తున్నామని, ఎవరైనా తనకు గిట్టనివారిపై తప్పుడు కేసు పెడితే నిజానిజాలు నిర్ధారించకుండానే పోలోమని అరెస్ట్ చేయడానికి వెళ్తారా? అంటూ మండిపడ్డారు. నరేంద్ర అక్రమ అరెస్టుకు వెంపర్లాడినట్టే మొన్న బీటెక్ రవి, ప్రవీణ్ కుమార్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారని, జగన్ తన స్వార్థం కోసం ముందు అన్నా...అన్నా అని తరువాత సున్నం పెడతారనడానికి మాజీ డీజీపీ గౌతమ్ సవాంగే నిదర్శనమన్నారు.

**OFFICE OF THE RETURNING OFFICER**
**SAHARAYN UNIVERSAL MULTIPURPOSE SOCIETY LIMITED**
**Regd. Office:** 195, Zone-1, In Front of D.B. Mall, M.P. Nagar, Bhopal, Madhya Pradesh-462011
**Tel.:** 0755-4296180, **Email ID:** sumsl.cooperative@sumsl.in, sumsl.cooperative@gmail.com

**To all members, notice is hereby given for conducting the Election of Delegates in terms of the provisions of bye-laws and Subsidiary Rules for Constituting a Smaller Representative General Body of Saharayn Universal Multipurpose Society Limited, election programme is as under :**

| | | | |
|---|---|---|---|
| 1) Place of filing nominations: | | | At respective Sector Office/Authorised Centre of the Society |
| 2) Date & Time of filing nominations: | Part-A | 11/12/2023 | From 09:00 A.M to 12:00 P.M. |
| | Part-B | 12/12/2023 | From 09:00 A.M to 12:00 P.M. |
| 3) Date and Time of Scrutiny and publication of list of valid nominations: | Part-A | 11/12/2023 | From 12:30 P.M. to 01:00 P.M. |
| | Part-B | 12/12/2023 | From 12:30 P.M. to 01:00 P.M. |
| 4) Last Date, Time of withdrawal of nominations: | Part-A | 11/12/2023 | till 4:00 P.M. |
| | Part-B | 12/12/2023 | till 4:00 P.M. |
| 5) Date of declaration of list of final nominations: | Part-A | 11/12/2023 | 4:30 P.M. |
| | Part-B | 12/12/2023 | 4:30 P.M. |
| 6) Date, Time of voting: | Part-A | 13/12/2023 | From 08:00 A.M. to 05:00 P.M. |
| | Part-B | 14/12/2023 | From 08:00 A.M. to 05:00 P.M. |
| 7) Date, Time of counting & declaration of the result: | Part-A | 13/12/2023 | Immediately after the voting is over |
| | Part-B | 14/12/2023 | Immediately after the voting is over |

**One Delegate to be elected from each constituency, name of constituency and venues for voting are mentioned below :**

| Name of constituency | Venue for Voting |
|---|---|
| | **PART A** |
| Patna | Sahara India Pariwar, Region Office, Sahara India Vihar 4th Floor, Boring Road Chauraha, Patna, Bihar- 800001 |
| Samastipur | Bahadurpur W.No. 26, Near Shiv Durga Mandir, Bahadurpur, Samastipur, Bihar- 848101 |
| Padrauna | Region Office, Near Fire Brigade Padrauna, Kushinagar, Uttar Pradesh- 274304 |
| Deoria | Jila Panchyat Bhawan, Civil Lines, Deoria, Uttar Pradesh- 274001 |
| Nalanda | Ranjan Commercial Complex, 2nd Floor Patna Ranchi Road, Bhaisasur, Bihar Sharif, Nalanda, Bihar- 803101 |
| Ranchi | 2nd Floor Mahabir Complex, I.T.I Road Near Piska more, Post- Hehal Ratu Road, Piska More, Ranchi, Jharkhand- 834005 |
| Bhubaneswar | Plot No. 702, Ice Factory Lane, Bandhan Cards Building, Bhubaneswar, Khordha, Odisha-751006 |
| Chandigarh | SCO 1110-1111, 2nd Floor, Sector 22-B, Chandigarh, Punjab-160022 |
| Azamgarh | 291/9, Civil Lines, Opp. Sudarshan Das Petrol Pump, Azamgarh, Uttar Pradesh- 276001 |
| Prayagraj | 25/51 M G Marg, Civil Lines, Allahabad, Prayagraj, Uttar Pradesh- 211003 |
| Barabanki | Tondon Complex Behind Tasty Bites, Civil Lines Infront Swastik Petrol Pump, Barabanki, Uttar Pradesh- 225001 |
| Khalilabad | Mehdawal Road, Khalilabad, Sant Kabir Nagar, Uttar Pradesh-272175 |
| Bahraich | S N Tower Gonda Road, HDFC Bank 3rd Floor Bahraich, Uttar Pradesh- 271801 |
| Sultanpur | Opp. Dist. Hospital, Dharmpal Complex, Ist Floor, Sultanpur, Uttar Pradesh- 228001 |
| Varanasi | Sahara India Kashi Niketan, B 8/90-91, Bara Gambhir Singh, Sonarpura, Varanasi, Uttar Pradesh- 221001 |
| Gorakhpur | Sahara India Niketan, 2nd Floor, Cinema Road, Gorakhpur, Uttar Pradesh- 273001 |
| Hardoi | Canal Road, Hardoi, Uttar Pradesh- 241001 |
| Fatehpur | Ashoka Lodge, Mohalla Kheldar G.T.Road, Fatehpur, Uttar Pradesh- 212601 |
| Mainpuri | H.No. C/7/A, Awas Vikash Colony, Numaish Chauraha, Etawah, Uttar Pradesh- 206001 |
| Vijayawada | D.No.52-1/1-1/B, 3rd floor, Sri Surya Premier, Veterinary Colony, Gunadala, Vijayawada, Krishna, Andhra pradesh- 520008 |
| Bhagalpur | 2nd Floor, Chandralok Complex, Ghantaghar Bhagalpur, Bihar- 812001 |
| Bhopal | 1st Floor Sahara India Kunj, 195, Zone-1, M.P. Nagar, Bhopal, Madhya Pradesh- 462011 |
| Siliguri | HMA Building, Near Pani Tanki More (Clock Tower), Nabin Sen Road, Mahakal Pally, Janta Nagar, Siliguri, West Bengal- 734001 |
| Mumbai | Flat No.110-11, Building No.2A, Apna Ghar Cooperative Society, Opp. Ginger Hotel Teli Gali, Andheri (East), Mumbai, Suburban, Maharashtra- 400069 |
| Kolkata | Disha Apartment, 470, Purbanchal Main Road, Near Kalikapur Bus Stand, Kolkata, West Bengal- 700078 |
| Ballia | 3rd Floor Anil Cement Agency, Near Sheesh Mahal Cinema, Sheeshmahal Gola Road, Ballia, Uttar Pradesh- 277001 |
| Raipur | Aviral Complex, 1st Floor, Raipura Chowk, Ring Road No 2, Raipur, Chhattisgarh- 492013 |
| Aurangabad | K P Agarwal Complex, M.G.Road, Aurangabad, Bihar- 824101 |
| | **PART-B** |
| Vaishali | Piyush Hotel, Gandhi Ashram, Near Railway Station, Hajipur, Vaishali, Bihar-844101 |
| Darbhanga | Mufti Mohalla, Naka No. 5, P. O.-Lalbagh, Darbhanga, Bihar- 846004 |
| Champaran | Above V-Mart Mall, Near Janpul Chowk, Main Road, Motihari, East Champaran, Bihar- 845401 |
| Siwan | Near Krishna Cinema Hall, Lal Palace, Station Road, Near Union Bank of India, Siwan, Bihar- 841226 |
| Gaya | 2nd Floor, J S Market, Tekari Road, Gaya, Bihar- 823001 |
| Tata Nagar | Jugsalai Moonka Honda Showroom, Near Ghora Chowk, P. O.-Jugsalai, Tatanagar, Jamshedpur, East Singhbhum, Jharkhand- 831002 |
| Cuttack | Shishu Bharati High School, Sector-6, Plot No. Pl/747, Near Ram Mandir, Cuttack, Odisha-753014 |
| Ambala | H. No. 5744, 1st Floor, Near Golden Transport Building, Above Corp. Bank, Nicholson Road, Ambala, Haryana- 133001 |
| Mau | Church Compound Near Ashish Nursing, Ghazipur Road, Mau, Uttar Pradesh, 275101 |
| Pratapgarh | Laxmi Complex, opp. Distt. Hospital, Kachehari Road, Pratapgarh, Uttar Pradesh- 230001 |
| Lucknow | 3rd Floor, Sahara Shopping Centre, Faizabad Road, Indira Nagar, Lucknow, Uttar Pradesh- 226024 |
| Basti | Infront of S K Pandey Inter College, Near Zamiya Complex, Station Road Basti, Uttar Pradesh- 272002 |
| Gonda | Near Ambedkar Chauraha, Lucknow Road, Gonda, Uttar Pradesh- 271002 |
| Faizabad | Above Bank of Baroda, Shadatganj Bypass, Ayodhya, Faizabad, Uttar Pradesh- 224001 |
| Ghazipur | Sahu Market, Bus Stand, Main Road, Jangipur, Ghazipur, Uttar Pradesh- 233305 |
| Pharenda | Near Tehsil Chouraha, Above PNB Bank, Anand Nagar, Pharenda, Maharajganj, Uttar Pradesh- 273155 |
| Sitapur | Opp. Rajasthani Hotel, Dr. B D Kapoor Marg, Arya Nagar, Sitapur, Uttar Pradesh- 266001 |
| Kanpur | Sahara India, Region Office 1st Floor, 117/N/98 Kaka Dev, Kanpur Nagar, Uttar Pradesh- 208025 |
| Bareilly | 186, Near Post Office, Patanjali Store, Bareilly, Uttar Pradesh- 243001 |
| Ahmedabad | 301, 302 3rd Floor Rajlaxmi Plaza, Near Hajipura Garden, Ahmedabad, Gujarat- 380004 |
| Shimla | Avadh Palace, Near Clark Hotel, The Mall Road, Shimla, Himachal Pradesh- 171001 |
| Jaipur | 33, Prithviraj Nagar, Maharani Farm, Durgapura, Jaipur, Rajasthan- 302018 |
| Dehradun | IInd Floor, Daya Palace, Haridwar Road, Dehradoon, Uttarakhand- 248001 |
| New Delhi | WZ1, Phool Bagh, Commercial Building 1st Floor, Tri Nagar, Rampura, Delhi- 110008 |
| Muzaffarpur | Above S.B.I. Akharaghat Branch, Akharaghat Road, Muzaffarpur, Bihar-842001 |
| Sambalpur | Hansini Tower, 2nd Floor, Ainthapali, Sambalpur, Odisha- 768004 |
| Bokaro | Bari Co-operative Colony, Plot No 307, Bokaro Steel City, Sector 12, Bokaro, Jharkhand- 827012 |

**Note:-**
1. At the time and place of election, members are requested to bring their photo-ID card with them.
2. The nomination form will be available at the respective Sector Office/Authorised Centre from the A.R.O. appointed by undersigned.
3. The list of the eligible members to vote and contest as per the provisions of the MSCS Act 2002, will be published by the Returning Officer and shall be available at all authorized centers and Registered office of the Society.
4. List of valid candidates shall be published at the respective Sector Office/Authorised Centre of the Society.

For and on behalf of **Saharayn Universal Multipurpose Society Limited**
S/d
Returning Officer

**Date:** 24-11-2023
**Place:** Bhopal

# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆలయంలో
# వైభవంగా కైశికద్వాదశి ఆస్థానం



తిరుమల మేజర్ న్యూస్ : కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో శుక్రవారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 4.45 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఉదయం 6 నుంచి ఉదయం 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**ప్రాశస్త్యం... :** పురాణాల ప్రకారం శ్రీ వైష్ణవ క్షేత్రాల్లో నిర్వహించే ముఖ్యమైన పర్వదినాల్లో కైశికద్వాదశి ఒకటి. శ్రీ వరాహ పెరుమాళ్ కైశికపురాణంలోని 82 శ్లోకాలతో శ్రీ భూదేవికి కథగా చెప్పిన రోజును కైశిక ఏకాదశిగా పిలుస్తారు. ఈ కథ ఆధారంగా కైశిక ద్వాదశి ప్రత్యేకతను సంతరించుకుంది.

**నంబదువాన్ కథ...:** కైశికద్వాదశి పురాణ నేపథ్యం విశేష ఘట్టాలతో కూడుకున్నది. శ్రీనంబదువాన్ (సత్యమూర్తి) అనే భక్తుడు స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించడానికి వెళుతుండగా మార్గమధ్యంలో ఒక బ్రహ్మరాక్షసుడు తారసపడి తినేస్తానన్నాడు. తాను శ్రీవారికి సంకీర్తనార్చన చేయడానికి వెళుతున్నానని తప్పక తిరిగివచ్చి ఆ బ్రహ్మరాక్షసుని క్షుద్బాధను తీరుస్తానని నంబదువాన్ ప్రమాణం చేశాడు. అన్న ప్రకారం స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించి బ్రహ్మరాక్షసుని చెంతకు వచ్చాడు. భక్త నంబదువాన్ భక్తికి, సత్యనిరతికి ముగ్ధుడై స్వామివారు మోక్షం ప్రసాదించారు. ఈ విధంగా ఉత్థానద్వాదశికి కైశికద్వాదశి అనే నామకరణం కలిగింది. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్స్వామి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు సుబ్బరాజు, యానాదయ్య, సౌరబ్ బోరా, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారిని అభిషేక సేవలో
## రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి



తిరుమల,మేజర్ న్యూస్ : శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని శుక్రవారం ఉదయం అభిషేక సేవలో సేవించి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు గారు దర్శించుకున్నారు. ఆయనకు టిటిడి అధికా రులు ఆలయం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లను చేపట్టారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వ చనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# తిరుమలలో వైభవంగా చక్రతీర్థ ముక్కోటి



తిరుమల మేజర్ న్యూస్ : తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాదీ కార్తీక మాసంలో చక్రతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే శ్రీవారి ఆలయ అర్చకులు, పరిచారకులు, భక్తులు ఉదయం మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుండి ఊరేగింపుగా చక్రతీర్థానికి చేరుకున్నారు. అక్కడ శ్రీ చక్రత్తాళ్వారుకు, నరసింహస్వామివారికి, ఆంజనేయస్వామివారికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు. హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్కంద పురాణం ప్రకారం పద్మనాభ మహర్షి అనే యోగి చక్రతీర్థంలో 12 సంవత్సరాలు తపస్సు చేశాడు. అందుకు సంతసించి శంఖు, చక్ర, గధా భూషితుడైన శ్రీ మహావిష్ణువు ఆతనికి ప్రత్యక్షమై కల్పాంతం వరకు తనకు పూజలు చేయాలని చెప్పి అంతర్థానమయ్యాడు. పద్మనాభ మహర్షి స్వామి ఆజ్ఞానుసారం చక్రతీర్థంలో తపస్సు చేశాడు. అయితే ఒకనాడు ఓ రాక్షసుడు అతనిని భక్షించడానికి రాగా మహర్షి తిరిగి స్వామివారిని ప్రార్థించాడు. అప్పుడు స్వామి తన చక్రాయుధాన్ని పంపించి ఆ రాక్షసుని సంహరించాడు. అటు తరువాత ఆ మహర్షి శ్రీ సుదర్శన చక్రాన్ని ఆ ప్రాంతంలోనే ఉండి భక్తులకు రక్షణ కల్పించాల్సిందిగా స్వామివారిని కోరాడు. భక్తవల్లభుడైన స్వామివారు తన సుదర్శన చక్రాన్ని ఆ ప్రాంతంలోనే ఉండేలా ఆజ్ఞాపించడంతో ఈ తీర్థం చక్రతీర్థంగా ప్రసిద్ధిగాంచింది. వరాహ పురాణ నేపథ్యంలో తిరుమలలోని శేషగిరులలో వెలసివున్న 66 కోట్ల తీర్థాలలో అత్యంత ముఖ్యమైనవిగా చెప్పబడే సప్త తీర్థాలలో చక్రతీర్థం ప్రముఖ తీర్థంగా చెప్పబడింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకు
# ముందస్తు బెయిల్



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : హత్యాయత్నం కేసులో గుంటూరు జిల్లా పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర సహా ఇతరులకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రంగాపురానికి చెందిన కొందరు రైతులు అక్కడ సంగం డెయిరీ ఆధ్వర్యంలోని పాల కేంద్రానికి పాలు సరఫరా చేశారు. దాని బకాయిలు అడిగేందుకు వారు ఇటీవల చేబ్రోలు మండలం వడ్లమూడిలోని డెయిరీ వద్దకు రాగా ఘర్షణ జరిగిందని, బాధితుల్లో ఒకరైన రాము ఫిర్యాదు మేరకు 15 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని చేబ్రోలు సీఐ తెలిపారు. ఈ కేసులో 14వ నిందితుడిగా ధూళిపాళ్ల నరేంద్రకుమార్, 15వ నిందితుడిగా జానకిరామయ్య పేర్లను ఎఫ్ఐఆర్లో చేర్చారు. విచారణ చేపట్టిన హైకోర్టు ధూళిపాళ్ల నరేంద్ర సహా ఇతరులకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

## వసంత మండపంలో ఆగమోక్తంగా
# శ్రీతులసి దామోదర పూజ

తిరుమల మేజర్ న్యూస్: తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో కార్తీక మాసంలో (టీటీడీ) తలపెట్టిన విష్ణుపూజల్లో భాగంగా కైశిక ద్వాదశిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వసంత మండపంలో శ్రీ తులసి దామోదర పూజ ఘనంగా జరిగింది. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని వసంత మండపానికి వేంచేపు చేశారు. ఎదురుగా తులసి, ఉసిరి వృక్షాలను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా పురాణ పండితులు రామకృష్ణ శేషసాయి మాట్లాడుతూ శ్రీ తులసి దామోదర పూజ విశిష్టతను తెలియజేశారు. కార్తీక మాసంలో ఈ పూజ చేయడం వల్ల పితృదేవతలు విష్ణుసాన్నిధ్యాన్ని చేరుతారని, కోటి జన్మల పుణ్యం లభిస్తుందని చెప్పారు. తులసిని పూజిస్తే గ్రహబాధలు తొలగుతాయని, సకల ఐశ్వర్యాలు చేకూరుతాయని వివరించారు. అనంతరం కార్తీక విష్ణుపూజా సంకల్పం, బ్రహ్మాది దేవతలకు ఆరాధన చేశారు.



# డంకీ డ్రాప్2 సాంగ్‌కు అమేజింగ్ రెస్పాన్స్

బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్, సక్సెస్‌వుల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో రూపొందుతోన్న మోస్ట్ అవెయిటింగ్ మూవీ డంకీ. ఈ చిత్రం నుంచి డంకీ డ్రాప్ 2 అంటూ సినిమా నుంచి లుట్ వుట్ గయా.. పాటను మేకర్స్ విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ సంగీతాభిమానుల హృదయాలను ఈ పాట హత్తుకుంది. ప్రేమలోని స్వచ్ఛతను తెలియజేసే ఈ పాట కచ్చితంగా మీ ప్లే లిస్టులో స్థానాన్ని కలిగి ఉంటుందనటంలో సందేహం లేదు. ఆడియెన్స్‌కి తిరుగులేని ట్రీట్‌ని అందించిన లుట్ వుట్ గయా.. పాట విడుదలైన 24 గంటల్లోనే 30 మిలియన్ వ్యూస్‌ను సంపాదించుకుంది. దీంతో రాజ్‌కుమార్ హిరాణి రూపొందిస్తోన్న డంకీ ప్రపంచంలో ఇంకెన్ని ఆసక్తికరమైన విషయాలు ఉండబోతున్నాయోనని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమాపై అంచనాలు పెరిగాయి. షారూక్ ఖాన్ పాత్ర ఇంకెలా ఉంటుందోననే ఆసక్తి అభిమానులకు, సినీ ప్రేక్షకులకు కలిగింది. ఇదే ఆసక్తిని వారు సెషన్‌లో కనపరిచారు.

# కూసే మునస్వామి వీరప్పన్ సీరీస్



పలు భాషల్లో వైవిధ్యమైన కంటెంట్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తూ మన దేశంలోనే అతి పెద్దదైన ఓటీటీ మాధ్యమంగా రాణిస్తోంది జీ5. తాజాగా ఇందులో మరో కొత్త ఒరిజినల్ చేరింది. అదే తమిళ్ ఒరిజినల్ సిరీస్ కూసే మునస్వామి వీరప్పన్. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అడవుల్లోకి పారిపోయి తలదాచుకున్న బందిపోటు దొంగ కూసే మునస్వామి వీరప్పన్ జీవితానికి సంబంధించి లోతైన అధ్యయనం చేసి ఈ ఒరిజినల్‌ను రూపొందించారు. ఈ క్రమంలో సదరు బందిపోటు దొంగకు సన్నిహితులైన వారి నుంచి వివరాలను సేకరించారు. అదేవిధంగా ఆయన్ని పట్టుకోవటానికి ప్రయత్నించిన అధికారుల నుంచి సేకరించిన వీడియోను కూడా పొందుపరిచారు. ఇది వీరప్పన్ యొక్క రహస్య జీవితాన్ని, అతని నేర వారసత్వాన్ని స్పష్టంగా ఆవిష్కరించింది. ఈ సిరీస్ ముందు వీరప్పన్ నెరేషన్‌తో ప్రారంభమవుతుంది. అతని పూర్తి జీవితాన్ని ఆవిష్కరిస్తూనే అతని చుట్టూ జరిగిన ఘటనలను గురించి కూడా తెలియజేస్తుంది. కూసే మునస్వామి వీరప్పన్ ఒరిజినల్‌ను 4 భాషల్లో జీ5 ఎక్స్‌క్లూజివ్‌గా డిసెంబర్ 8 నుంచి స్ట్రీమింగ్ చేయనుంది.

# ఉషా ప్రయాణం ప్రారంభం



తెలుగు సినీ రంగంలో దర్శకుడిగా తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకున్న దర్శకుల్లో ఒక్కరైన కె.విజయ్‌భాస్కర్ మళ్లీ ఓ సరికొత్త ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్ చిత్రానికి శ్రీకారం చుట్టాడు. నువ్వేకావాలి, మన్మధుడు, మ్లీశ్రీ వంటి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్ చిత్రాల్ని తెర్కెక్కించిన ఆయ్న స్వీయ దర్శకత్వంలో ఉషా ప్రయాణం పేరుతో రూపొందనున్న ఈ ల్వ్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్ ప్రారంభోత్సవం హైద్రాబాద్‌లో జరిగింది. పూజా కార్యక్రమాల అనంతరం హీరో, హీరోయిన్లపై సన్నివేశాల చిత్రీకరణతో రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టారు దర్శకుడు విజయ్‌భాస్కరన్. ఉషా ప్రయాణం అనే బ్యూటిఫుల్ టైటి ల్‌తో రూపొంద్నున్న ఈ చిత్రానికి లవ్ ఈజ్ బ్యూటిఫుల్ అనేది ఉపశీర్షిక్. క్రాఫ్ట్ ప్రొడక్షన్ పతాకంపై కె.విజయ్‌భాస్కరన్ స్వీయ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రంలో విజయ్‌భాస్కర్ తనయుడు శ్రీ్మ హీరోగా నటిస్తుండగా, హు ఈజ్ ఉషా అంటూ సోషల్ మీడియాలో జరిగిన చర్చను తెరదించుతూ తాన్వీ ఆకాంక్ష అనే అచ్చతెలుగమ్మాయి ఈ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం కాబోతుందనే విషయాన్ని రివీల్ చేశారు.

# సత్యాస్ ఫిల్మ్ అకాడమీలో సర్టిఫికేషన్ డిస్ట్రిబ్యూషన్ గాలా



సత్యాస్ ఫిల్మ్ అకాడమీ ప్రతిభావంతులైన విద్యార్థుల యాక్టింగ్ కోర్స్ కంప్లిషన్ సత్కరిస్తూ తన సర్టిఫికేషన్ డిస్ట్రుభూషణ్ కార్యక్రమాన్ని సగర్వంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి, బేబీ చిత్ర దర్శకుడు సాయి రాజేష్ నీలం గారు హాజరయ్యారు. ఈ వేడుకకు ఓసీ మూవీ డైరెక్టర్ విష్ణు బొంపల్లి, నటుడు హరీష్ బొంపల్లి సహా సినీ రంగానికి చెందిన సినీ డ్యాన్స్ డైరెక్టర్లు ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఫిలిం ఆర్టిస్ట్ కోటి గారు కూడా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో నటీమణులు సౌమ్య మరియు శైలజ కూడా పాల్గొన్నారు. సత్యాస్ ఫిల్మ్ అకాడమీ, యాక్టింగ్ కోర్స్, డైరెక్షన్, సినిమాటోగ్రఫీ, స్క్రిప్ట్ రైటింగ్, ఫిట్నెస్ క్లాస్స మరియు డ్యాన్స్‌లలో అడ్వాన్స్ కోర్సులను 'అందించ డంలో ముందుంది. సత్యస్ ఫిలిం అకాడమీలో విద్యార్థులు తమ అంకితభావానికి మరియు కవిషికి ప్రతీకగా సర్టిఫికెట్ అందజేశారు.

# ఈగల్ షూటింగ్ పూర్తి



మాస్ మహారాజా రవితేజ మోస్ట్ ఎవైటెడ్ ఇంటెన్స్ అండ్ యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ ఈగల్ థియేట్రికల్ రాకకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ పీవుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ ఈగల్ నుంచి రవితేజ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 50 డేస్ కౌంట్‌డౌన్ పోస్టర్‌లో రవితేజ డెస్క్‌పై చాలా ఆయుధాలతో కనిపించారు. స్టైలిష్ డ్రెస్సింగ్ లో చాలా ఇంటెన్స్ లుక్ లో ఆకట్టుకున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో క్యూరియాసిటీ పెంచింది. కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో మేకర్స్ మరింత దూకుడు పెంచారు. సినిమాలో రవితేజ మల్టీ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయికగా నటిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరో కథానాయికగా నటించింది. నవదీప్, మధుబాల ఇతర ముఖ్య తారాగణం.

# డబుల్ ఇస్మార్ట్‌లో మణిశర్మ ఆన్ బోర్డ్



సెన్సేషనల్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, మెలోడీ బ్రహ్మ మణిశర్మలది బ్లాక్ బస్టర్ కాంబినేషన్. పోకిరి, చిరుత, ఇస్మార్ట్ శంకర్ చిత్రాలు చార్ట్ బస్టర్ ఆడియో, బాక్సాఫీస్ హిట్స్ గా నిలిచాయి. ఉస్తాద్ రామ్ పోతినేనితో దర్శకుడు పూరీ జగన్నాథ్ చేస్తున్న తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' కోసం ఈ బ్లాక్ బస్టర్ కాంబినేషన్ మరోసారి కలిసి పనిచేస్తున్నారు. ఇస్మార్ట్ శంకర్ మ్యూజికల్ గా పెద్ద హిట్ అయ్యింది. సీక్వెల్ ఖచ్చితంగా చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించనుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఈ చిత్రంలో ఇంపార్‌టెంట్, లెన్తీ రోల్ ని పోషిస్తున్నారు. ఇందులో ప్రముఖ నటీనటులు కూడా ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. రామ్, సంజయ్ దత్ పేస్ ఆఫ్ చూడటానికి అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. రామ్, పూరీ జగన్నాథ్ డెడ్లీ కాంబినేషన్‌లో డబుల్ ఇస్మార్ట్ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు.

# సీట్ ఎడ్జ్ రివెంజ్ థ్రిల్లర్ అక్క



ఇండియన్ సినీ ఇండస్ట్రీలో భారీ సినిమాలను రూపొందిస్తూ తనదైన గుర్తింపును సంపాదించుకున్న ప్రొడక్షన్ హౌస్ యష్ రాజ్ ఫిలిమ్స్. మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కి శ్రీకారం చుట్టింది. సీట్ ఎడ్జ్ రివేంజ్ థ్రిల్లర్ జోనర్‌లో పీరియాడిక్ థ్రిల్లర్‌గా వెబ్ సిరీస్‌ను తెరకెక్కించనున్నారు. చిత్ర పరిశ్రమలో విలక్షణమైన పాత్రలతో మెప్పిస్తోన్న వెర్సటైల్ యాక్టర్స్ కీర్తి సురేష్, రాధికా ఆప్టే ఇందులో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మన చిత్ర పరిశ్రమలో కీర్తి సురేష్, రాధికా ఆప్టే వంటి నటీమణులు ఉండటం అనేది మనకు ఓ బహుమానంగా చెప్పొచ్చు. వారు సహజ సిద్ధమైన నటనతో మెప్పిస్తారు. వారి అద్భుతమైన నటనతో ప్రశంసలను పొంది తద్వారా తమదైన క్రేజ్‌ను వారు సంపాదించుకున్న సంగతి తెలిసిందే. పోటా పోటీగా నటించే వీరిద్దరూ కలిసి అక్క అనే స్ట్రీమింగ్ ప్రాజెక్ట్‌తో అలరించబోతున్నారు. ఇదే ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది అని ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. ఆదిత్య చోప్రా నిర్మాతగా ధర్మరాజ్ శెట్టి అనే డెబ్యూ డైరెక్టర్ ఈ ప్రాజెక్టని రూపొందిస్తున్నారు. అక్క ప్రాజెక్ట్‌పై డైరెక్టర్ విజన్‌ని గుర్తించిన ఆదిత్య చోప్రా భారీ బడ్జెట్‌తో అక్క సిరీస్‌ను వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్ మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. దీనికి సంబంధం చిన వివరాలను సీక్రెట్‌గానే ఉంచుతున్నారంటూ సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఉక్కుసత్యాగ్రహం ట్రైలర్



సత్యా రెడ్డి గారు నిర్మాతగా దర్శకత్వం చేస్తూ నటించిన సినిమా ఉక్కు సత్యాగ్రహం. ఈ సినిమా ట్రైలర్ మరియు సాంగ్స్ లాంచ్ ఈవెంట్ లో దర్శకుడు త్రినాధ రావు నక్కిన గారు, ఎమ్మెల్యే ధర్మశ్రీ గారు, గద్దర్ వెన్నెల గారు, ఫిలిం ఛాంబర్ మాజీ చైర్మన్ బివి రెడ్డి గారు, పారిశ్రామికవేత్త రాజీవ్ గారు, మరియు ప్రొడ్యూసర్ దాసరి కిరణ్ గారు పాల్గొన్నారు.గద్దర్ గారి కుమార్తె వెన్నెల గారు మాట్లాడుతూ : మా నాన్నగారైన గద్దర్ గారు ప్రజల కోసం ఎంతో పాటు పడేవారు. ఆయన రాసిన పాటలు గాని గేయాలు గాని అన్ని ప్రజల కోసము ప్రజల సమస్యల మీదనే ఉండేవి. కరోనా సమయంలో కూడా ఆంధ్ర తెలంగాణ ఇరు రాష్ట్రాల్లోనే అన్ని ప్రాంతాలు తిరిగి ప్రజల కోసం ఎంతో సేవ చేశారు అలాగే వారి సమస్యలను ఉద్దేశిస్తూ ఎన్నో పాటలను కూడా ఆయన రాశారు పాడారు. అలాగే ప్రజా సమస్యల పైన పోరాడే చిత్రాలను ఎక్కువగా నటించిన నాన్నగారు ఈ సినిమాలో పాటలు రాయడంతోపాటు నటించారు.



# హాయ్ నాన్న తో ప్రేమలో పడిపోతారు

నేచురల్ స్టార్ నాని మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్న'. వైర ఎంటర్‌టైన్‌మెంట్ మొదటి ప్రొడక్షన్ వెంచర్‌గా రూపొందిన ఈ చిత్రం ద్వారా శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రేక్షకులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ని గ్రాండ్ లాంచ్ చేశారు. నాని ఒక రాజు కథను చెప్పడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. అందులో తల్లి పాత్ర లేనప్పుడు, పాప తన తల్లి కథను చెప్పని కోరుతుంది. అతను ప్రతిదీ వివరిస్తాడు కానీ ఆమె తల్లి గురించి ఏదో దాచిపెడతాడు. కథలో చాలా ఎమోషన్ ఉంది, దీంతో పాప తన తల్లి గురించి తండ్రిని ఇబ్బందిపెట్టాలని అనుకోదు. కథలో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, పాప కొత్త స్నేహితురాలు యష్నా (మృణాల్)ని తన తల్లిగా ఊహించుకుంటుంది. అయితే, శృతి హాసన్, విరాజ్ భార్యగా, మహి తల్లిగా రివిల్ అవుతుంది. ట్రైల్ ముందుకు వెళుతున్న కొద్దీ క్ఫో చాలా లేయ్యు ఆసక్తిగా తెరపైకి వస్తాయి. ప్రేమకథలో మ్యాజిక్ ఉంది, తండ్రీకూతుళ్ల ఎమోషన్ ప్రతిఒక్కరినీ హత్తుకుంటుంది. దర్శకుడు శౌర్యువ్ పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ని అద్భుతంగా మలిచాడు. రెగ్యులర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు భిన్నంగా కథను చాలా కొత్త తరహాలో ప్రజెంట్ చేశాడు. నాని మాట్లాడుతూ.. ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో నన్ను నేను తెరపై చుసుకున్నవుడు వీడెవడో బావున్నాడు అని అనిపించింది హాయ్ నాన్న సినిమాకే(నవ్వుతూ). శౌర్యువ్ రాసుకున్న కథలో సాన్ జాన్ చూపించిన విజివల్స్ చాలా బావుంటాను. డిసెంబర్ 7కి మీరంతా ప్రేమలో పడిపోయే సినిమా వస్తుంది అన్నారు.

# హరోం హర టీజర్



హీరో సుధీర్ బాబు పాన్ ఇండియా చిత్రం హరోం హర. సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో ఎస్ఎస్‌సి బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సుధీర్ బాబుకు ఇది అత్యంత భారీ బడ్జెట్ మూవీ. ది రివోల్ట్ అనేది సినిమా ట్యాగ్‌లైన్. తాజాగా ఈ చిత్రం టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. హరోం హర పవర్ ఆఫ్ సుబ్రమణ్యం టీజర్ నవంబర్ 27న విడుదల కానుంది. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో నిప్పుల కొలిమిలో ఓ ప్రత్యేకమైన ఆయుధాన్ని కాల్చుతూ మజిల్డ్ బాడీతో ఇంటెన్స్ లుక్ లో కనిపించారు సుధీర్‌బాబు. ఈ పోస్టర్ చాలా క్యురియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో మాళవిక శర్మ హీరోయిన్ గా నటిస్తోంది. సునీల్, అక్షర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే హరోం హర కథలో సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు పలకనున్నారు.

# డిసెంబర్ 1న విక్రమ్ రాథోడ్



కెరీర్ ఆరంభం నుంచీ వైవిధ్యభరితమైన పాత్రలు పోషిస్తూ అందరినీ ఆకట్టుకుంటూ వస్తున్నారు విజయ్ ఆంటోని. కథలకు ప్రాధాన్యం ఇస్తూ, వైవిధ్యమైన నటనను కనబరుస్తూ దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు విజయ్ ఆంటోని. రీసెంట్‌గానే బిచ్చగాడు 2 సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్నారు. అదే జోష్‌లో ఇప్పుడు మరో డిఫరెంట్ కాన్సెప్ట్ యాక్షన్ ఎంటర్‌టై నర్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. విజయ్ ఆంటోనీ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో విక్రమ్ రాథోడ్ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రం విడుదలకు సిద్దంగా ఉంది. అపోలో ప్రొడక్షన్స్, ఎస్‌ఎన్‌ఎస్ మూవీస్ సంయుక్త సమర్పణలో తెరకె క్కగా.. బాబు యోగేశ్వరన్ దర్శకత్వం వహించారు. రావూరి వెంకట స్వామి, ఎస్.కౌసల్య రాణి నిర్మాతలుగా వ్యవహరించారు. మ్యూజిక్ మాస్ట్రో ఇళయ రాజా సంగీతం అందిస్తున్నారు.

# వధువు వెబ్ సీరీస్ ట్రైలర్



సరికొత్త కంటెంట్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న డిస్నీ ఫ్లస్ హాట్ స్టార్ అందిస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ వధువు. ఈ వెబ్ సిరీస్ లో అవికా గోర్, నందు, అలీ రెజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ ను ఎస్వీఎఫ్ బ్యానర్ లో శ్రీకాంత్ మొహ్తా, మహేంద్ర సోని నిర్మిస్తున్నారు. పోలూరు కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ 8వ తేదీ నుంచి వధువు వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది. ఇవాళ ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేశారు. వధువు వెబ్ సిరీస్ ట్రైలర్ ఎలా ఉందో చూస్తే...'వెయ్యి అబద్ధాలు ఆడైనా ఒక పెళ్లి చేయాలంటారు. కానీ ఈ పెళ్లిలో అన్నీ రహస్యాలే అంటూ పెళ్లి కూతురు ఇందు చెప్పిన డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆనంద్‌ను పెళ్లి చేసుకుని అత్తవా రింటికి వెళ్లిన ఇందుపై వివిధ రకాలుగా హత్యా యత్నాలు జరుగుతుంటాయి. ఇవన్నీ అనుకోకుండా జరిగినట్లు కాకుండా.. ఎవరో కావాలని చేసినట్లే ఉంటాయి. అత్తవారింట్లో ప్రతిఒక్కరి ప్రవర్తన అనుమానాస్ప దంగా కనిపిస్తుంటుంది. ఓ అపరిచిత క్యారెక్టర్‌లోని మహిళ అసలైన ఆట ఇప్పుడే మొదలైంది అనడం...ఇందుకు రాబోతున్న ప్రమాదాలను సూచిస్తుంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.